PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 338 | విజయవాడ, గురువారం 11 జులై 2024 | 8+ 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 11 July 2024 | Rs



సుందర్ ఆల్‌రౌండ్ షో

లోపలి పేజీలో..



ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల కార్యక్రమంలో మంత్రులు

5

కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు

'ఉక్కు' ప్రైవేటీకరణపై టిడిపి వైఖరేంటి?

- నేడు స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి సమీక్ష
- సెయిల్‌లో విలీనం చేయాలి : సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై తెలుగుదేశం పార్టీ వైఖరి ఏంటని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఎందుకంటే కేంద్రంలోని బిజెపి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కృతనిశ్చయంతో ఉంది. టిడిపి మద్దతు ఇస్తుందా? లేక వ్యతిరేకించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటుందా? అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రాష్ట్రం నుంచే బిజెపి తరపున ఎంపి అయిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇటీవలి మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ పాలసీనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వర్తిస్తుందని అన్నారు. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ. 2,859 కోట్ల నష్టాన్ని చవిచూసిందని, దాని సామర్థ్యం 7 మిలియన్ టన్నుల (ఎంటి)కంటే చాలా తక్కువగా ఉందని అన్నారు. ఏటా కంపెనీ భారీ నష్టాలను చవిచూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకుందని చెప్పారు. ఈ ప్రకటనపై రాష్ట్రంలోని టిడిపి, జనసేన ఎంపీలెవరూ స్పందించలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన సందర్భంగా దాదాపు పది మంది కేంద్ర మంత్రులను కలిశారు. కాని కేంద్ర ఉక్కు మంత్రిని కలవలేదు. ఆయనను కలిసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని చంద్రబాబు కోరతారని రాష్ట్ర ప్రజలు, కార్మిక సంఘాలు భావించాయి. కానీ, అలా జరగలేదు. ప్రధాని మోడీ దగ్గర అసలు ఈ విషయం ప్రస్తావించనేలేదు. దీంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను టిడిపి వ్యతిరేకిస్తుందా లేదా అన్న సందేహం కలుగుతోంది.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి మాట్లాడేది. ఆ పార్టీ ఎంపి, ప్రస్తుత కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఆన్‌లైన్‌లో సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం టిడిపి మద్దతుపై ఆధారపడి కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నడుస్తోంది. అయినా, ఏం మాట్లాడటం లేదు. మరోవైపు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, సిఐటియు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపైనా టిడిపి మాట్లాడడం లేదు.

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి గురువారం ఉదయం 11:30 గంటలకు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అందులో ఏం జరుగుతుందో చూడాలి. "ప్రస్తుతం, వైజాగ్

మిగతా 7లో



డెక్కన్ క్రానికల్ బోర్డుకు నిప్పు పెట్టిన దృశ్యం

విశాఖలో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి

లోపలి పేజీలో..



భరణం భిక్ష కాదు హక్కు

- ముస్లిం మహిళలకూ భరణం కోరే హక్కు ఉంది
- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: విడాకుల అనంతరం మహిళలకు తమ మాజీ జీవిత భాగస్వామి నుండి భరణం పొందడం భిక్ష కాదని, అది ఓ హక్కు అని, చట్ట ప్రకారం విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలూ ఇందుకు అర్హులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన మహ్మద్ అబ్దుల్ సమద్ తన మాజీ జీవిత భాగస్వామికి 20 వేలు భరణం చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పుపై చేసిన అప్పీలును విచారించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు నిచ్చింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)-1973 లోని సెక్షన్ 125 ప్రకారం చట్ట బద్ధంగా విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకూ భరణం పొందే హక్కు ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సెక్షన్ 125 ప్రకారం మతంతో ప్రమేయం లేకుండా వివాహితులైన ఏ మహిళకైనా ఇది వర్తిస్తుందని చెప్పింది. 'భరణం ఇవ్వడం అనేది ఏదో దయతో పెట్టే భిక్ష కాదు. భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొందరు భర్తలు ఇంకా గుర్తించడం లేదు. ఇల్లాలి పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది' అని ధర్మాసనం ఘాటుగానే హెచ్చరించింది.

బిపిసిఎల్‌తో భారీ పెట్టుబడులు

- కంపెనీ ప్రతినిధులతో సిఎం భేటీ
- అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ
- 5వేల ఎకరాలు ఇవ్వడానికి సుముఖత



ముఖ్యమంత్రితో సమావేశమైన బిపిసిఎల్ ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆ సంస్థ ఛైర్మన్, ఎండి కృష్ణకుమార్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ఆయన సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించి వారితో చర్చించారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించిన చంద్రబాబు చర్చలు సాకారమైతే 60 వేల కోట్ల రూపాయల దాకా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుందని పేర్కొన్నారు. టీవల కేంద్ర మంత్రులను కలిసి తమరాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో బిపిసిఎల్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చి సిఎంను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్థ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను 90 రోజుల్లో సమర్పించాలని వారికి సూచించారు. ఆ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పెట్రో కెమికల్, రీ ఫైనరీ ఏర్పాటుకు తమకు కనీసం 4నుండి 5వేల ఎకరాల భూమి అవసరమౌతుందని కంపెనీ ప్రతినిధులు సిఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సముద్రతీరంలో గణనీయంగా పెట్రోలియం ఉత్పత్తులు ఉన్నాయని, వెంటనే కంపెనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్స్ వేదికలో ఇదే విషయాన్ని పేర్కొన్న సిఎం పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటులో ఇది తొలి అడుగని తెలిపారు. చర్చల అనంతరం బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి మీడియాతో మాట్లాడారు. బందరు పరిధిలో ఏర్పాటు చేసే సదుపాయాలకు సంబంధించిన అంశాలు కంపెనీకి వివరించామని, వారు కూడా త్వరలోనే డిపిఆర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన హామీల్లో పెట్రోలియం రిఫైనరీ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారని, దాని మేరకు కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఇక్కడ రిఫైనరీ వస్తే రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 25 వేలమందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. అంతకుముందు మచిలీపట్నం ఎంపి బాలశౌరి, బిపిసిఎల్ ఎమ్‌డి కృష్ణకుమార్, బోర్డు సభ్యులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

సిఎంను కలిసిన విన్‌ఫాస్ట్ ప్రతినిధులు

వియత్నాంకు చెందిన ఆటోమొబైల్ రంగ సంస్థ విన్‌ఫాస్ట్ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిశారు. ఈ సంస్థ ఎలక్ట్రిక్ బ్యాటరీలు, వాహనాలు తయారు చేయడంలో పేరుగాంచింది. సంస్థ సిఇఓ ఫామ్ సాన్‌చౌ తన ఆహ్వానం మేరకు వచ్చారని సిఎం ఎక్స్ వేదికగా తెలిపారు. అలాగే సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించాలని పరిశ్రమలశాఖను సిఎం ఆదేశించారు.

విద్యుత్ భారాలు ఏం చేస్తారు?

కొనసాగిస్తారా...ఉపసంహరిస్తారా! • రాష్ట్ర ప్రభుత్వానికి వివిఎస్‌ఆర్ ప్రశ్న

శ్వేతపత్రం నిరాశ పరిచిందని వ్యాఖ్య

కేంద్ర మాట విని గత ప్రభుత్వం మాదిరే సంస్కరణల బాట నడుస్తోందని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం ప్రజలపై మోపిన వేల కోట్ల రూపాయల విద్యుత్ భారాలను ఏం చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ప్రశ్నించారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణతో కలిసి మాట్లాడిన ఆయన విద్యుత్ రంగానికి సంబంధించి ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రంలోని పలు అంశాలను ప్రస్తావించారు. 'భారాలను కొనసాగిస్తారా.. ఉపసంహరిస్తారా?' అని ప్రశ్నించారు. ఈ విషయమై ఎటువంటి స్పష్టత ఇవ్వని శ్వేతపత్రం ఆశాభంగం కలిగించిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు తగ్గిస్తామని పదేపదే చెప్పడంలో ప్రజలు కూడా అనేక ఆశలు పెట్టుకున్నారని, వారందరికీ నిరాశ కలిగిందని



చెప్పారు. 'గత ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయలు భారం వేసిందని శ్వేత పత్రంలో చెప్పారు. ఇప్పుడు మరో 17 వేల కోట్ల రూపాయల ట్రూఅప్ చార్జీలు పైప్ లైన్లో ఉన్నాయి. వీటిని ఉపసంహరించుకుంటారా..? ప్రజల మీద వేస్తారా?' అని ప్రశ్నించారు. 'గత ప్రభుత్వం వేసింది. దాని ఫలితం వారు అనుభవించారు. మీరు కూడా కేంద్ర ప్రభుత్వం మాట విని, వాళ్ల బాటలోనే ప్రపంచబ్యాంకు సంస్కరణలను కొనసాగించి, ఈ 17 వేల కోట్ల రూపాయల ట్రూ అప్ ఛార్జీలను కొనసాగిస్తారా... ఉపసంహరించుకుంటారా? 'అని అడుగుతున్నట్లు చెప్పారు. 'ఉపసంహరించుకోకపోతే విద్యుత్ సంస్కరణలు 3.0పై పోరాడాల్సిన పరిస్థితి ప్రజలకు ఏర్పడుతుంది.' అని అన్నారు. 'భారాలు తగ్గిస్తామని అదనపు భారాలు మోపితే ప్రజలు సహించరు' అని చెప్పారు. 'శ్వేతపత్రంలో ఏమి స్పష్టత లేదని, ఒక రకంగా గత ప్రభుత్వం చేసిన తప్పులను కప్పిపెట్టే విధంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. అదాని విషయంలో, షిర్డి సాయి విషయంలో గత ప్రభుత్వం మాదిరి ఈ ప్రభుత్వం కూడా సానుకూల వైఖరితో ఉందని అన్నారు. షిర్డి సాయి సంస్థ నుండి తెలుగు దేశం పార్టీకి కూడా ఎలక్టోరల్ బాండ్లు అందిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి విద్యుత్ సంస్కరణల విషయంలో తేడా ఏముందని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, అవినీతి మీద విచారణ జరపాలని, అదానికిచ్చిన భూములను వెనక్కి తీసుకుని గిరిజనులకు వాళ్ల భూములు వెనక్కివ్వాలని, భారాలు తగ్గించాలని గత ప్రభుత్వం మోపిన 32 వేల కోట్లరూపాయల భారాన్ని సర్దుబాటు చేయాలని, పైప్‌లైన్‌లో

మిగతా 7లో

సినిమా టికెట్ల రేట్లు పెంచే అధికారం రాష్ట్రానికి ఉందా?

- తేల్చుతామన్న హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

భారీ బడ్జెట్ సినిమాలకు రిలీజ్ అయిన కొత్తలో టికెట్ల రేట్లను పెంపుదల చేసే అధికారం రాష్ట్రానికి ఉందో లేదో తేల్చుతామని హైకోర్టు ప్రకటించింది. కల్కి సినిమాకు మొదటి పది రోజులు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే తరహాలో గతంలో దాఖలైన పిటిషన్లు అన్నింటినీ కలిపి విచారిస్తామని ప్రకటించింది. లోతుగా విచారిస్తామని చెప్పింది. విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాస్ నటించిన కల్కి సినిమా టికెట్ ధరలను రెండు వారాల పాటు పెంచుకునేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ నెల్లూరుకు చెందిన రాకేష్ రెడ్డి పిల్‌పై విచారణ చేపట్టింది.

గతంలో మొదటి 10 రోజులపాటు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతినిచ్చిన ప్రభుత్వం ఇప్పుడు కల్కి సినిమాకు 14 రోజులకు ఎలా ఇస్తుందని హైకోర్టు ప్రశ్నించింది.

75 శాతం హాజరు ఉంటేనే తల్లికి వందనం

- మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న తల్లికి వందనం పథకానికి హాజరు నిబంధనను విధించింది. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం కింద రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తామని టిడిపి కూటమి సూపర్ సిక్స్‌లో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విషయం తెలిసిందే. దారిద్ర్యయ రేఖ దిగువ (బిపిఎల్) ఉన్న వారికి ఈ పథకం అమలవుతుందని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జిఓ 29ను విడుదల చేశారు. 1 నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు ఈ పథకం కింద రూ.15 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ఇది పొందాలంటే విద్యార్థి హాజరు 75 శాతం ఉండాలనే షరతు విధించారు. అదే విధంగా ఆధార్ కార్డు అనుసంధానం చేయాలని, అందువల్ల ఆధార్‌ను ఎన్‌రోల్ చేసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంకు, లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, పాన్, పాస్‌పోర్ట్, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కార్డు, కిసాన్ ఫోటో పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, గెజిటెడ్ ఆఫీసర్ లేదా తహశీల్దార్ ఇచ్చిన గుర్తింపు పత్రం, ఇతర శాఖలు ఇచ్చిన పత్రాలతో ఎన్‌రోల్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్‌కు కూడా ఆధార్ ఉండాలని పేర్కొన్నారు.

ధర్మారెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డిపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిటిడి మాజీ ఇఒ ధర్మారెడ్డి, సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ విజయ్ కుమార్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ధర్మారెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి పదవీ కాలంలో పెద్దయెత్తున అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ధర్మారెడ్డిపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు చేయగా, విజయ్ కుమార్‌రెడ్డిపై జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదులు చేశాయి. ఇటీవలే ధర్మారెడ్డి ఉద్యోగ విరమణ చేయగా, కేంద్రంలో చేరేందుకు ఢిల్లీకి వెళ్లిన తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి వెనక్కు వచ్చారు. దర్యాప్తులో భాగంగా వారి అవినీతికి సహకరించిన ఇతర ఉద్యోగులనూ విచారణ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీవాణి టికెట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, వైసిపికి విరాళాలు సేకరించారని, బడ్జెట్‌తో సంబంధం లేకుండా సివిల్ కాంట్రాక్టు పనులు ఇచ్చారని ధర్మారెడ్డిపై అభియోగాలు ఉన్నాయి. సమాచార శాఖలో ప్రకటనల పేరిట రూ.కోట్లు మేర అవినీతికి పాల్పడ్డారని విజయ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి.

కదంతొక్కిన కార్మికవర్గం



విజయవాడ లెనిన్ సెంటరులో నిర్వహించిన స్కీం వర్కర్ల ధర్నాలో కె సుబ్బరావమ్మ, ఎవి నాగేశ్వరరావు

- డిమాండ్స్ డేలో భాగంగా ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి- యంత్రాంగం

డిమాండ్స్ డే భాగం రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం బుధవారం కదంతొక్కింది. కలెక్టరేట్లు, ఆర్‌డిఎ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలు, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నా, పలు జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించింది. అధికారులకు వినతిపత్రం అందజేసింది. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలనే స్థానే తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేకమైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీలను, ఆశాలను, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వోద్యోగస్తులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ప్రమాదకర క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని తదితర డిమాండ్‌తో ఈ కార్యక్రమాలు చేపట్టింది.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మెజార్టీని కోల్పోయి మూడోసారి అధికారంలోకి వచ్చినా తన కార్మిక వ్యతిరేక విధానాల నుంచి వెనక్కు తగ్గలేదన్నారు. కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం స్కీమ్ వర్కర్లు ధర్నా చేశారు. వడ్లపూడిలోని రైల్వే వర్క్‌షాప్, భెల్ మెయిన్‌గేటు, హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద కార్మికులు నిరసన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు, ఆశాలు, భవన నిర్మాణరంగ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరించడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు, సీట్లు గణనీయంగా తగ్గాయన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ పాత విధానాలనే అనుసరిస్తోందని తెలిపారు. ప్రజల తీర్పును అనుసరించి కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడకపోతే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంగన్‌వాడీలు మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి

మిగతా 7లో

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

- రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

ఎమ్మెల్యే పదవికి జగన్‌మోహన్‌రెడ్డి రాజీనామా చేస్తారని, ఎంపిగా పోటీ చేస్తారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆయన బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. విభజన చట్టంలో చెప్పిన విధంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి కూటమి భాగస్వామిగా ఉన్నందున ప్రత్యేక హోదా కోసం పోరాడాలని సూచించారు. ఇతర విభజన హామీలను కేంద్రం ద్వారా సాధించుకోవాలని చెప్పారు. విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడుకోవడం మంచి పరిణామమేనని తెలిపారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ విధానం మంచిదేనని చెప్పారు. అయితే, దీని గురించి వైసిపి మీద విమర్శలు చేయడం సరికాదన్నారు. టిడిఆర్ బాండ్ల విషయంలో అవినీతి జరిగి ఉంటే విచారణ జరిపించుకోవచ్చని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఉన్నత విద్యా మండలిలో అక్రమాలపై పిల్

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో నిధుల దుర్వినియోగంపై ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. కర్నూలుకు చెందిన నాగరాజు ఇతరులు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. ఉన్నత విద్యా మండలిలో నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఐఎఎస్ చక్రపాణి ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌తో విచారణ చేయించిందని న్యాయవాది ఎంఆర్‌కె చక్రవర్తి చెప్పారు. బాధ్యులను కమిషన్ గుర్తించినప్పటికీ చర్యలు లేవన్నారు. ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను అక్టోబరు 16కు వాయిదా వేసింది.

మాజీ ఎమ్మెల్సీ రఘురాజు పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

పార్టీ విప్‌ను ధిక్కరించారంటూ వైసిపి ఫిర్యాదు మేరకు తనపై శాసనమండలి ఛైర్మన్ అనర్హత వేటు వేయడాన్ని మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను డివిజన్ బెంచ్‌కు నివేదించాలని సింగిల్ జడ్జి బుధవారం రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీ చేశారు. అనర్హత వేటు వ్యాజ్యాలను ధర్మాసనమే విచారించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని సింగిల్ జడ్జి జస్టిస్ చీమలపాటి రవి చెప్పారు. అనర్హత వేటుకు సంబంధించిన కేసులను డివిజన్ బెంచ్ విచారించాలని ఇసి తరపున సీనియర్ అడ్వకేట్ అవినాష్ దేశాయ్ చెప్పారు. దీంతో రఘురాజు పిటిషన్‌ను ధర్మాసనానికి నివేదించాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. ఇదే తరహాలో అనర్హతపై మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వేసిన పిటిషన్ కూడా డివిజన్ బెంచ్ ముందుకు వెళ్లనుంది.

తగ్గింది కొంచెమే...!

- ఇసుక విధానంపై పెదవి విరుపు
- ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వస్తే ధరలు మారే అవకాశం !



గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెం వద్ద ఇసుక కోసం బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉచిత ఇసుకపై జరిగిన ప్రచారం ఎలా ఉన్నప్పటికీ ఆచరణలో ధరలు పెద్దగా తగ్గలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూలీ, రవాణా ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్న మొత్తం గణనీయంగానే ఉందని వినియోగదారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గతంలో ట్రాక్టరు ఇసుక రూ.ఐదు వేలు పలకగా ప్రస్తుతం గరిష్ఠంగా రూ.మూడు వేల నుంచి రూ.3,500కు లభ్యం అవుతోంది. లారీ ఇసుక గతంలో రూ.25 వేలు ఉండగా ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది.ఓపెన్ ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వస్తే ధరలు మారే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలంలో వింజరం, ఇబ్రహీంపేటలో మూడు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా ప్రారంభమైంది. చేబ్రోలు స్టాక్ పాయింట్‌లో టన్ను ఇసుక ధర రూ.538, వింజరం స్టాక్ పాయింట్‌లో రూ.362, ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌లో టన్ను ఇసుక రూ.210 చొప్పున ధర నిర్ణయించారు. ఐదు కిలోమీటర్ల లోపు రవాణాకు ట్రాక్టర్ బాడుగ రూ.500 నుంచి రూ700కు తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక ట్రాక్టర్‌కు మూడు టన్నుల ఇసుక పడితే ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ నుంచి ఐదు కిలోమీటర్లకు దాదాపు రూ1100 నుంచి రూ.1300 పడుతుంది. దూరాన్ని బట్టి ట్రాక్టర్ బాడుగు మారుతూ ఉంటుంది. గతంలో ఇదే ట్రాక్టర్‌కు రూ. మూడు వేల నుంచి రూ. ఐదువేలు తీసుకునేవారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లు, కాకినాడ జిల్లాలో ఒక స్టాక్ పాయింట్, తూర్పు గోదావరి జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్లలో కలిపి మొత్తంగా 6.60 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మెట్రిక్ టన్నుకు రూ.245, తూర్పు గోదావరి జిల్లాలో రూ.335, కాకినాడ జిల్లాలో రూ.655కి అందిస్తున్నారు. ట్రాక్టర్‌లో ఒక మెట్రిక్ టన్నును తరలించేందుకు దూరాన్ని బట్టి రూ.500 నుంచి రూ.700 వరకూ తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక మెట్రిక్ టన్ను ఇసుక రవాణాతో కలిసి రూ.745 నుంచి రూ.1,355 వరకూ ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మెట్రిక్ టన్ను ఇసుక రవాణాతో కలిసి రూ.2,443 వసూలు చేసేవారు. డిమాండ్‌ను బట్టి రూ.ఐదు వేల నుంచి రూ.11వేల వరకూ విక్రయించారు.

అనంతపురం జిల్లాలో రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలో రూ.192గా నిర్ణయించారు. ఐదు కిలోమీటర్ల వరకూ ట్రాక్టర్ బాడుగ రూ.1000 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక ట్రాక్టర్‌కు మూడు టన్నులు కలిపి రూ.1500 అవుతుంది. ఆరు యూనిట్ల టిప్పర్ ఇసుక గతంలో రూ.17 వేల వరకు ఉండగా ప్రస్తుతం అది రూ.14 వేలకు వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కేంద్రం, కొత్తూరు మండలం అంగూరులో టన్ను ఇసుక రూ.340కు అమ్ముతున్నారు. రవాణాకు కిలోమీటరుకు రూ.4.59 వసూలు చేస్తున్నారు. గతంలో ఇదే పాయింట్ నుంచి రవాణా, సీనరైజ్ ఛార్జీలను కలుపుకుని రూ.770కు విక్రయించారు.

గుంటూరు జిల్లాలో ఐదు చోట్ల, పల్నాడు జిల్లాలో ఆరు చోట్ల నిల్వ ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి అధికారులు విక్రయాలకు అనుమతి ఇచ్చారు. గుంటూరు జిల్లాలో టన్ను రూ.250, పల్నాడు జిల్లాలో టన్ను రూ. 192 చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు రవాణా ఛార్జీలు అదనంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో రవాణా ఛార్జీలతో కలిపి టన్ను కనీస ఛార్జీ రూ.475 నుంచి గరిష్ఠంగా రూ.750 వరకు వసూలు చేశారు. ప్రస్తుతం రూ.400-700 వసూలు చేస్తున్నారు.

నెల్లూరు జిల్లా మర్రిపాడు ఇసుక యార్డ్ నుంచి గత ప్రభుత్వం టన్ను రూ.723 అమ్ముతుండగా ప్రస్తుతం రూ.370లు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మినగల్లు నుంచి నెల్లూరు సిటీకి (25 కిలోమీటర్లు) ఇసుక తెచ్చుకోవాలంటే ట్రాక్టర్‌కు రూ.2,000 నుంచి రూ.2500 అవుతుంది. గత ప్రభుత్వంలో ఇదే ట్రాక్టర్‌కు రూ. ఐదువేలకు ఇంటికి చేరేది.

ఎన్‌టిఆర్ జిల్లా పెండ్యాల స్టాక్‌యార్డులో 29,672 టన్నులు, మాగల్లులో 54,549 టన్నులు, కొడవటికల్లులో 14,570 టన్నులు, అల్లూరుపాడులో 4,560 టన్నులు, అనుమంచిపల్లిలో 85,230 టన్నులు, పోలంపల్లిలో 1,383 టన్నులు, కీసరలో 2,24,555 టన్నులు, మోగులూరు స్టాక్‌యార్డులో 1,39,865 టన్నుల మేర ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. రెండు రోజులుగా కృష్ణాజిల్లా బందరు, గుడివాడ, పామర్రు, బంటుమిల్లి తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా జరగలేదు. ఈ క్రమంలో టన్ను ఇసుకకు ఎంత ఖర్చవుతుందనేదానిపై స్పష్టత రాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడా ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాలేదు.

అల్ట్రాటెక్ ఘటనలో మరొకరు మృతి

- రెండుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మతుల సంఖ్య రెండుకు చేరింది. ఈ నెల 7న జరిగిన ప్రమాదంలో అదే రోజున ఆవుల వెంకటేష్ అనే కార్మికుడు మరణించగా, తీవ్ర గాయాలపాలై తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాణావత్ స్వామి (26) మూడు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం రాత్రి ప్రాణాలు విడిచారు. ఇంకా 15 మంది విజయవాడ గొల్లపూడిలోని ఆంధ్రా ఆస్పత్రి, తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాణావత్ స్వామికి భార్య శైలజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మతదేహాన్ని అంబులెన్స్‌లో మృతుని స్వగ్రామం బూదవాడకు తరలించారు. గ్రామంలోని శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.



బాణావత్ స్వామి

సిఐటియు నేతలు, ఎమ్మెల్యే, ఎస్‌టి కమిషన్ సభ్యుల నివాళి

స్వామి మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, ఎస్‌టి కమిషన్ సభ్యులు సోమనాయక్ తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మృతుని భార్యకు రూ.50 లక్షలు అందజేత

స్వామి భార్య శైలజకు రూ.50 లక్షల పరిహారం అందజేశారు. ఎస్‌టి కమిషన్ సభ్యులు వదిత్య సోమ నాయక్, నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు, డ్వామా పిడి జె.సునీత, నందిగామ ఎసిపి డాక్టర్ రవి కిరణ్ చేతుల మీదుగా చెక్కు అందించారు.

కాలుష్య నియంత్రణ మండలిని ప్రజలకు చేరువచేయాలి : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి కాలుష్యనియంత్రణ మండలిని ప్రజలకు చేరువచేయాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని తన నివాసంలో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ మండలి ప్రధాన కార్యాలయంతో పాటు రీజినల్, జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు సమయం కేటాయించాలన్నారు. మండలి వెబ్‌సైట్లో రాష్ట్రంలో వాయు, జల, శబ్ద కాలుష్యం వివరాలను ప్రజలకు అవగాహన కలిగించే విధంగా పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి మధ్యాహ్నం 5గంటల మధ్య ఫిర్యాదుల స్వీకరణ, సమస్యలు తెలుసుకునేందుకు సమయం నిర్దేశిస్తామని మండలి సభ్య కార్యదర్శి బి.శ్రీధర్ తెలిపారు. ఈసమావేశంలో మండలి అధికారులు ఎన్‌వి భాస్కరరావు, కె.శ్రీరామమూర్తి, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు బుధవారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేశారు. ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో ఎంఇఒ, సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వైజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని, నూతన డిఎస్‌సిలో వెయిటేజీ ఇవ్వాలని నినదించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విజయనగరం జిల్లాలోని అన్ని ఎంఇఒ కార్యాలయాలు, కెజిబివి పాఠశాలల వద్ద ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. మెంటాడలో ఫెడరేషన్ జెఎసి ఛైర్మన్ కాంతారావు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలు విడుదల కాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 22వ రోజు సమ్మె కాలం జీతం, సమ్మె కాలపు ఒప్పందాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, అన్నీ విభాగాలకు మినిమం టైమ్ స్కేలు వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు.



ఏలూరులో ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఏలూరులోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. మండవల్లి, కొయ్యలగూడెం తదితర మండల కేంద్రాల్లో ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఆందోళన నిర్వహించి ఎంఇఒలు, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



డెక్కన్ క్రానికల్ కార్యాలయం ఆవరణలో పత్రికా ప్రతులను దగ్ధం చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్, తెలుగు మహిళా నాయకులు

విశాఖలో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఆంగ్ల దిన పత్రిక డెక్కన్ క్రానికల్‌లో "ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డజ్ ఏ యు-టర్న్ ఆన్ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటైజేషన్" శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనాన్ని నిరసిస్తూ తెలుగు విద్యార్థి స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్), తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని అప్పుఘర్ వద్ద ఉన్న డెక్కన్ క్రానికల్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. టిఎన్ఎస్ఎఫ్ నేతలు డెక్కన్ క్రానికల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పత్రిక ప్రతులను దగ్ధం చేశారు. డెక్కన్ క్రానికల్ కార్యాలయం బోర్డుకు నిప్పుపెట్టి లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఎంవిపి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడి అప్రజాస్వామికం : సిపిఎం

విశాఖలోని డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టిడిపి విద్యార్థి విభాగం, టిడిపి కార్యకర్తల దాడిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా ఖండించారు. పత్రిక కార్యాలయంపై రాళ్లు విసిరి, సంస్థ బోర్డును తగులబెట్టి దాడులకు పాల్పడడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాసిన పత్రికా కార్యాలయాలపైన, జనర్నలిస్టులపైన దాడులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ఈ తరహా దాడులను ప్రభుత్వాలు నియంత్రించకపోతే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

డెక్కన్ క్రానికల్‌పై దాడి పిరికి పంద చర్య

- మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని, అది పిరికి పంద చర్య అని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ చర్య మీడియాను అణచివేసే కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. నిష్పక్షపాత వార్తలను టిడిపి జీర్ణించుకోలేక ఇలాంటి దాడులకు తెగబడుతోందని అన్నారు. రాష్ట్రంలో కూటమి పాలనలో ప్రజస్వామ్యం ఖూనీ అవుతోందని, ఈ దాడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే బాధ్యత వహించాలని జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఖండన

విశాఖలో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. దాడిని ఖండిస్తూ ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంశంలో కూటమి యుటర్న్ అనే వార్తను ప్రచురించారని టిడిపి కార్యకర్తలు డెక్కన్ క్రానికల్ కార్యాలయంపైకి రాళ్లురువ్వడం, నేమ్ ప్లేట్‌ను ధ్వంసం చేయడం తగదని పేర్కొన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం మీడియాపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు కె మునిరాజ్, వి శ్రీనివాసరావు.. డెక్కన్ క్రానికల్‌పై దాడిని ఖండించారు.

మైనర్ బాలిక హత్య

- అత్యాచారం చేసి నదిలో పడేసినట్లు అనుమానాలు
- పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు మైనర్ బాలురు

ప్రజాశక్తి - పగిడ్యాల (నంద్యాల)

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి, సుజాత దంపతుల కుమార్తె వాసంతి (9) ఈ నెల ఏడున హత్యకు గురయ్యారు. అత్యాచారం చేసి నదిలో పడేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలికను చంపి కృష్ణా నదిలో పడేసినట్లు ముగ్గురు మైనర్ బాలురు బుధవారం పోలీసులకు లొంగిపోయారు. మొదట వాసంతిని చంపి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కెనాల్ ర్యాంపు సమీపాన పడేశామని పోలీసులకు చెప్పారు. వెంటనే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ తర్వాత పంప్ హౌస్ సమీపాన కృష్ణానదిలో పడేసినట్లు మళ్లీ పోలీసులకు బాలురు చెప్పారు. దీంతో రెస్క్యూ టీం పంప్ హౌస్ వద్ద నీటిలో గాలింపు చర్యలు చేపట్టింది. స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి, జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన తర్వాత చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు, నాయకులు పి.పకీర్ సాహెబ్ డిమాండ్ చేశారు.

వైసిపి పాలనలో విద్యుత్తు శాఖలో భారీ అవినీతి

- లంకా దినకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఐదేళ్ల పాలనలో విద్యుత్తు శాఖలో పెద్దయెత్తున అవినీతి జరిగిందని, పది సార్లు ట్రూఅప్ పేరుతో రూ.32,166 కోట్లు అదనపు భారం ప్రజలపై మోపారని బిజెపి అధికార ప్రతినిధి లంకా దినకర్ ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత పాలకుల అసమర్థతతో విద్యుత్తుశాఖ నష్టాలు రూ.1,29,503 కోట్లు అని తేల్చారని, పాలనా లోపాలతో రూ.1,12,422 కోట్లతో డిస్కామ్‌లు అప్పులు పేరుకుపోయాయన్నారు.




కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న స్టీల్ పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, ఎం.జగ్గునాయుడు

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- ఉక్కు శాఖ మంత్రికి స్టీల్ పరిరక్షణ పోరాట కమిటీ వినతి

ప్రజాశక్తి- విశాఖపట్నం

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని స్టీల్ పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, ఎం.జగ్గునాయుడు కోరారు. శాశ్వత పరిష్కారంగా స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి విశాఖ విమానాశ్రయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనులు లేవని, దీనివల్ల ఈ ప్లాంట్‌పై ఏటా రూ.2 వేల కోట్ల రూపాయల భారం పడుతోందని, ప్లాంట్ నష్టాలకు ఇదొక కారణమని వివరించారు. సెయిల్‌లో విలీనం ద్వారా ముడి సరుకు సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గత మూడున్నరేళ్లగా ఉత్పత్తిని తగ్గించి స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టిందని పేర్కొన్నారు. ముడిసరుకు కొరత, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల స్టీల్ ప్లాంట్ నష్టాలోకి వచ్చిందని వివరించారు. సొంత గనులు సమకూర్చి, ఉత్పత్తి సామర్థ్యం పెంచి పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేస్తే దేశంలోనే మొదటి స్థానంలో ఉంటుందని వివరించారు. దేశంలోనే అత్యుత్తమైన ఈ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి చొరవ తీసుకోవాలని ఈ వినతిపత్రంలో కోరారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

గంజాయి జోలికి పోవద్దు

- వంద రోజుల్లో నియంత్రణకు చర్యలు
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)

చేతులెత్తి దండం పెడతా... గంజాయి జోలికి పోవద్దు... మన పిల్లల్ని ఆ ఉచ్చులోకి దించొద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో గంజాయి నియంత్రణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ అరాచకం జరిగినా దాని మూలాలు గంజాయితో ముడిపడి ఉంటున్నాయని, గంజాయికి మూలాలు మన జిల్లాయేనని దుష్ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా వంద రోజుల్లో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అధికంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో కొంత మంది బడాబాబుల ప్రోద్భలంతో గంజాయివైపు మొగ్గు చూపుతూ గిరిజనులు జైలు పాలవుతున్నారని వివరించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఉదయం ప్రార్థన సమయంలో ఐదు నిమిషాలు గంజాయి వల్ల నష్టాలను వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 2.50 లక్షల మంది గిరిజన కుటుంబాలు కాఫీ సాగు చేస్తున్నాయని, అరకు కాఫీని అభివృద్ధి చేయడం ద్వారా గంజాయి సాగును తగ్గించవచ్చని సూచించారు. గిరిజనులకు గతంలో మాదిరిగానే ఐటిడిఎ ద్వారా 16 పథకాలు అమలు చేయటానికి, ట్రైకార్ రుణాలు అందించటానికి, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



సౌరబ్‌గౌర్‌కు వినతిపత్రం అందచేస్తున్న లక్ష్మణరావు, ప్రసన్న, అశోక్ తదితరులు

ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్లతో విద్యార్థులకు నష్టం

- ఉన్నత విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
- విద్యాశాఖ సిఎస్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్ల వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొంది. విద్యావ్యవస్థలో ఏక పక్ష నిర్ణయాలు సరికాదని తెలిపింది. ఈ మేరకు బుధవారం పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు ప్రణీత ఉన్నత విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సౌరబ్‌గౌర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఉన్నత విద్య ధ్వంసమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా నిరంకుశంగా వ్యవహరించకుండా సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యార్థిసంఘాలు, విద్యావేత్తలతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలతో ఉన్నత విద్య బాగా దెబ్బ తిందన్నారు. ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియతో విద్యార్థులకు బాగా నష్టం జరిగిందన్నారు. అలాగే జీఓ 77ను రద్దు చేయాలని కోరారు.



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ రామారావు

త్వరలో దుర్గమ్మ ఆలయానికి కొత్త పాలకమండలి

- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - (విజయవాడ) వన్‌టౌన్

దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి త్వరలోనే కొత్త పాలక మండలిని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్.రామారావు స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం మీడియాతో మంత్రి ఆనం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో సౌకర్యాలు, అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై సమీక్ష చేస్తున్నామని తెలిపారు. రాష్టంలో ఏడు ప్రసిద్ధ ఆలయాలున్నాయని, వాటిలో శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయం ఒకటన్నారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి ఇఒ వివరించారని, కొన్ని పనులు చేయాల్సి ఉందని తెలిపారు. అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో కొత్త పాలక మండలి కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు.

కుంటలో పడి ఇద్దరు మృతి

- అనంతపురం జిల్లా కుందుర్పిలో విషాదం

ప్రజాశక్తి-కుందుర్పి (అనంతపురం)

అనంతపురం జిల్లా కుందుర్పిలో విషాదం చోటుచేసుకుంది. పాఠశాలకు వెళ్లిన ఓ విద్యార్థి బహిర్భూమికి నీటికుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. బాలుడిని కాపాడేందుకు మరో యువకుడు కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో ఊపిరాడక మరణించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుందుర్పి మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్ ఉన్నత పాఠశాలలో సజ్జల విష్ణు (11) ఆరవ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో కొందరు విద్యార్థులతో కలిసి బాలుడు బహిర్భూమి కోసం పాఠశాల సమీపంలోని భద్రకుంట వద్దకు వెళ్లాడు. నీటిలో బాలుని చెప్పులు జారిపోవడంతో వాటిని తీసుకునేందుకు కుంటలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. గమనించిన కుందుర్పి గ్రామానికి చెందిన యువకుడు కంసాల నవీన్ (21) విద్యార్థిని కాపాడేందుకు నీటిలోకి దిగారు. ఊబి ఎక్కువగా ఉండడం, యువకుడికి ఈతరాకపోవడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని నీటిలో మునిగి పోయిన ఇద్దరినీ బయటకు తీశారు. అప్పటికే నవీన్ మృతి చెందాడు. విష్ణును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు తెలియజేశారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న తెలిపారు.

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- జివో 117 రద్దు చేయాలి : యుటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిన విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో తీసుకున్న చర్యలు ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. 4,457 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గత ప్రభుత్వం విలీనం చేసిందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ఒక్క విద్యార్థి కూడా వీటిల్లో చేరని పరిస్థితి ఏర్పడిందన్నారు. జిఒ 117తో ఉపాధ్యాయులను తగ్గించిందన్నారు. ఉన్న 37 వేల ప్రైమరీ పాఠశాలల్లో 20 వేల పాఠశాలల్లో విద్యార్థులు 10-15లోపే ఉన్నారని వివరించారు. తల్లికి వందనం పేరుతో గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలు.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తరలించుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులలైందని, ఎఫ్ఎ-1 పరీక్షలు కూడా రాబోతున్నా, ఇప్పటికీ అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయలేదని అన్నారు. మాతృభాషను ప్రవేశపెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో రాయాలా? తెలుగులో రాసే అవకాశం కల్పిస్తారో తేల్చలేదన్నారు. 1,040 పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్ ప్రవేశపెట్టారని, దీనిని చదవలేక వేరే పాఠశాలలకు విద్యార్థులు తరలిపోతున్నారని చెప్పారు. ఈ సిలబస్ కొనసాగించే విషయాన్ని పునరాలోచించాలని కోరారు. రాష్ట్ర మంతటా ఒకే విద్యా విధానం, ఒకే సిలబస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత బోధనేతర పనుల నుంచి విముక్తి కలుగుతుందని ఉపాధ్యాయులు ఆశించారని చెప్పారు. రోజురోజుకూ పనులు ఎక్కువ పెరగడంతో ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరిగిపోతుందని వెల్లడించారు. పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్న సమయంలో టీచింగ్ టూల్స్, శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేశారని వివరించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం చేయడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 హెడ్ ద్వారా జీతాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, సర్వీస్ రూల్స్‌పై సాగదీస్తున్నారని తెలిపారు. 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, 2008 ఎంటిఎస్ టీచర్ల సర్వీసులను రెగ్యులర్ చేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సిఆర్‌టిలుగా పనిచేస్తున్న వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉందన్నారు. ఈ అంశాలను కొత్త ప్రభుత్వం సరిదిద్దాలని కోరారు. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు అదనంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు ఎన్ కుసుమకుమారి, ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం హనుమంతరావు పాల్గొన్నారు.


డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్‌లకు సమస్యలను వివరిస్తున్న సిహెచ్.నర్సింగరావు

ఇఎస్ఐ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసౌకర్యాలు

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నంలోని ఇఎస్ఐ ఆస్పత్రి, డిస్పెన్సరీలలో మెరుగైన వైద్య సేవలు కల్పించాలంటూ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇఎస్ఐ ఆస్పత్రిని తనిఖీ చేసేందుకు వచ్చిన కామన్ సపోట్ మిషన్ టీమ్ ఛైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్‌లకు.. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అర్‌టి.రాజు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. ఇఎస్ఐ బోర్డులో కార్మికుల డబ్బు రూ.లక్షల కోట్లు ఉన్నప్పటికీ, సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇఎస్ఐ ఆస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లో కనీస రక్త పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు కూడా లేవని తెలిపారు. రోగులకు అవసరమైన మందులు, ఇతర సామగ్రి అందుబాటులో లేవని వివరించారు. ఇఎస్ఐ రోగులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని, రిఫరల్ ఆస్పత్రుల సంఖ్యను పెంచాలని, ఆస్పత్రికి అవసరమైన డాక్టర్లు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. రోగులకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు వెంటనే క్యాంటిన్ ఏర్పాటు చేయాలని కోరారు. షీలానగర్ వద్ద ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బర్న్ వార్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్ స్పందిస్తూ ఇఎస్ఐలో ప్రస్తుతమున్న విభాగాల్లో పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలను తెలుసుకుంటామని, విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మత్స్యకారులకిచ్చే పరిహారం, లబ్ధిదారుల జాబితాపై రీ సర్వే

- 4 వేల వేట పడవలకు శాటిలైట్ సిస్టమ్
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారం, లబ్ధిదారుల జాబితాపై రీ సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో ఇచ్చే భృతిని నిష్పక్షపాతంగా ఇవ్వలేదని, చాలాచోట్ల అనర్హులకు అందజేశారని, అర్హులకు ఇవ్వలేదని మంత్రి వ్యాఖ్యానించారు. విజయవాడ పెనమలూరులోని మత్స్యశాఖ కమిషనరు కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో మత్స్యకారులను అప్రమత్తం చేయడంతోపాటు క్షేమంగా ఒడ్డుకు చేరుకునేలా వేటకు వెళ్లే పడవలకు శాటిలైట్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 20 వేల వేట పడవలు ఉండగా, వాటిలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 4 వేల పడవలకు శాటిలైట్ సిస్టమ్‌ను పెడుతున్నట్లు, దశలవారీ మిగిలిన పడవలకు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు డీజిల్ రాయితీ రూ.10 కోట్ల బకాయిలు పెట్టిందని, డీజిల్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. మత్స్యశాఖ అభివృద్ధి విషయంలో కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ఐదు హార్బర్లకు టెండర్లు పిలిచి సొంత వారికే కట్టబెట్టారని, పనులు ప్రారంభించేందుకు 40 శాతం నిధులు చెల్లించిందని అన్నారు. రెండోసారి నాలుగు హార్బర్లను అప్పటి ఎమ్మెల్యే, ఆయన తమ్ముడికి ఇచ్చారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ నాలుగింటిలో రెండు హార్బర్లు పనిచేయడం లేదని పేర్కొన్నారు. అలాగే బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఓడరేవు, బియ్యపు తిప్ప ఫిషింగ్ హార్బర్ల స్థితిగతులపైనా నివేదిక ఇవ్వాలన్నారు. 2014-19 వరకు మత్స్యశాఖ అమలు చేసిన పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. విజయవాడ, కలిదిండిలోని ఆక్వాహబ్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆక్వాకల్చర్, మత్స్యశాఖ సెక్రటరీ అహ్మద్‌బాబు, మత్స్యశాఖ కమిషనరు ఎ సూర్యకుమారి, అదనపు సంచాలకులు ఎస్ అంజలి పాల్గొన్నారు.

మళ్లీ ఓట్ ఆన్ అక్కౌంట్?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరోసారి ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన ఓట్ ఆన్ అక్కౌంట్ అనుమతి ఈ నెలాఖరుకు ముగుస్తున్న నేపథ్యంలో తప్పనిసరిగా మరోసారి బడ్జెట్‌కు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

అయితే ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్‌కు వెళ్లాలా, లేక రెండు నెలలకు ఓట్ ఆన్ అక్కౌంట్‌కు వెళ్లాలా అన్నదానిపై ఆర్థికశాఖ సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. దీని విషయమై త్వరలో స్పష్టత రానుంది.

ఐసిడిఎస్ బలోపేతానికి బడ్జెట్

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయడంతోపాటు బడ్జెట్‌ను కూడా పెంచాలని ప్రభుత్వానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. జులై 10 అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరుకు రవిప్రకాష్ రెడ్డికి యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐఎల్‌సి సిఫార్సుల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలకు తక్షణం జిఓలు ఇవ్వాలని, అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయడంతోపాటు ఐదేళ్లలోపు పిల్లలు ప్రైవేటు కాన్వెంట్‌లకు వెళ్లకుండా సర్క్యులర్ ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఐసిడిఎస్ ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఎన్నికల తర్వాత జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతంగా రాజీనామాలు చేయించడం, సెంటర్లకు తాళాలు వెయ్యడం, రాజకీయ వేధింపులకు పాల్పడటం ఆపాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ ఉన్నారు.


స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరుకు రవిప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు, సుబ్బరావమ్మ, బేబిరాణి తదితరులు

వ్యవసాయ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులకోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేరళ తరహాలో వ్యవసాయకార్మికులకు సంక్షేమ బోర్డును తీసుకురావాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు పిఎస్ అజయ్‌కుమార్, ముజఫర్ అహ్మద్, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, డిబిఎఫ్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఐద్వా రాష్ట్ర నాయకులు శ్రీనివాసకుమారి, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం భాస్కరయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, తదితరులు మాట్లాడుతూ . రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో పెట్టినందున రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులంతా తెలుగుదేశం కూటమి విజయానికి దోహదపడ్డారని చెప్పారు. రాష్ట్రంలో వున్న కోటీ 40లక్షల మంది వ్యవసాయకార్మికుల్లో 80శాతం దళిత,గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వారేనని అన్నారు. వీరికి ఎలాంటి సామాజిక భద్రతా కార్యక్రమాలు లేవన్నారు. ఏటా దేశంలో సగటున 6వేల మంది వ్యవసాయకార్మికులు ఆకలి చావులతో చనిపోతున్నట్లు నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక చెబుతోందన్నారు. సంక్షేమ బోర్డు వుంటే వ్యవసాయ కార్మికులకు ఎంతో అండ వుంటుందని తెలిపారు. 60ఏళ్లు దాటాక వ్యవసాయకార్మికులకు పెన్షన్ వస్తుందని అన్నారు. అలాగే ప్రమాదభీమా, గృహనిర్మాణాలకు రుణాలు, పిల్లల చదవులకు స్కాలర్‌షిప్‌లు, వైద్య సేవలకు చేయూత అందుతుందన్నారు. కేరళలో 48 ఏళ్లుగా వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు వుందని అదే తరహాలో రాష్ట్రంలో కూడా రైతులను, వ్యవసాయకార్మికులను బాగస్వామ్యం చేస్తూ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శివనాగరాణి, కె ఆంజనేయులు, కె కల్యాణ్, ఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది మోసపూరిత ఖాతాలు

- ఎన్‌బిఎఫ్‌సిల్లో లోపాలు
- సిఎఫ్ఒలు సీరియస్‌గా తీసుకోవాలి
- ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆందోళన



న్యూఢిల్లీ : బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థల్లో ఇటీవల లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరిగిపోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. మోసపూరిత లావాదేవీలు, ఎవర్‌గ్రీనింగ్ రుణాల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాలు ఇటీవల పెరిగాయన్నారు. కొన్ని బ్యాంకులు ఇలాంటి లక్షలాది ఖాతాలను కలిగి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. రుణగ్రహీత చెల్లించిన ప్రిన్సిపల్ మొత్తంను మళ్లీమళ్లీ రుణ రూపంలో ఖాతాదారులకు ఇవ్వడాన్ని ఎవర్‌గ్రీనింగ్ రుణాలుగా భావిస్తారు. మంగళవారం బ్యాంకుల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, ఆడిటర్లతో జరిగిన సమావేశంలో స్వామినాథన్ మాట్లాడుతూ.. అంతర్గత ఖాతాల నియంత్రణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయని విత్త సంస్థలను ఉద్దేశించి అన్నారు. కొన్ని బ్యాంకులకు సరైన కారణం లేకుండా లక్షలాది ఖాతాలు కలిగి ఉండటాన్ని తాము గుర్తించామన్నారు. గత వారం బ్యాంక్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలోనూ మోసపూరిత ఖాతాలపై ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ మోసాలను అరికట్టాలని సూచించారు. ఈ ఖాతాల్లో కొన్ని మోసపూరిత లావాదేవీలు, రుణాల ఎవర్ గ్రీన్ కోసం వినియోగిస్తున్నట్లు స్వామినాథన్ తెలిపారు. ఈ ఖాతాలతో దుర్వినియోగానికి అవకాశం ఉన్నందున వాటిని హేతుబద్ధీకరించాలని సూచించారు. వీలైనంత వరకు తగ్గించాలన్నారు. సంస్థల ఆర్థిక సమగ్రతను, పారదర్శకతను కాపాడుకోవడంలో సిఎఫ్ఒలు కీలక పాత్రను పోశించాలన్నారు. పలు బ్యాంకుల్లో సరైన కారణం లేకుండా కొనసాగిస్తున్న లక్షలాది ఖాతాలు కొన్ని మోసపూరిత లావాదేవీలకు మద్దతును ఇస్తున్నాయన్నారు. విత్త సంస్థల్లో పారదర్శకత పెంచడానికి ఆడిటర్లు, సిఎఫ్ఒలు నిజాయితీతో వ్యవహారించాలని మరో డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు సూచించారు. ఎన్‌బిఎఫ్‌సిలలో మార్గదర్శకాల అమలు లోపించిందన్నారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి మద్దతు

- అసోచామ్ ప్రతినిధుల వెల్లడి



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధిని కొనసాగించడానికి ఇరు ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని అసోచామ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ ఛైర్మన్ కటారు రవి కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాలో 2024-25కు గాను అసోచామ్ తొలి ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి రవి కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. దీనికి ఆ సంస్థ ప్రతినిధులు శ్రీధర్ పిన్నపురెడ్డి, బన్సిధర్ బండి తదితరులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని రవి కుమార్ అన్నారు. సమ్మిళిత, స్థిరమైన సామాజిక ఆర్థిక వృద్ధిని సాధించాలనేదే తమ లక్ష్యమన్నారు.

ఫైల్స్ దగ్ధం కేసు దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి) ఫైల్స్ దహనం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బుధవారం విజయవాడలోని పిసిబి ప్రధాన కార్యాలయంలో పోలీసులు విచారణను చేపట్టారు. కార్యాలయం నుంచి దస్త్రాలు బయటకు వెళ్లడంపై అన్ని విభాగాల్లోని అధికారులను పోలీసులు ఆరా తీశారు. ఫైల్స్, హార్డ్ డిస్కులు బయటకు వెళ్లటంలో అధికారుల పాత్ర, కాల్చిన ఫైల్స్‌లోని అంశాలు, వాటి ప్రాధాన్యతపై దర్యాప్తు చేపట్టారు. ఫైల్స్‌లోని సమాచారంపై సిబ్బంది నుండి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇటీవల కృష్ణా కరకట్టపై దస్త్రాల దహనం ఘటనకు సంబంధించి పెనమలూరు పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 106 కింద కేసు నమోదు చేశారు. సమీర్ శర్మ వద్ద ఒఎస్‌డిగా పనిచేసిన రామారావు, డ్రైవర్ నాగరాజు, అటెండర్ రూపేంద్రను స్టేషన్‌కు పిలిపించి సుదీర్ఘంగా విచారణ జరిపారు. దస్త్రాల్ని తీసుకొచ్చిన వాహనాన్ని ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కోచ్‌లకు వేతన బకాయిలు చెల్లించాలి

- డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)లో పనిచేస్తున్న కోచ్‌లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2017 నుంచి అవుట్‌సోర్సింగ్‌లో శాప్‌లో 97 మంది కోచ్‌లు పనిచేస్తున్నారని తెలిపారు. వీరెవరికీ కనీస వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన శాప్‌లో రెగ్యులర్ కోచ్‌లు లేకపోవడం అన్యాయమన్నారు. శాప్‌లో కేవలం 13 మంది రెగ్యులర్ ఉద్యోగులు వున్నారని పేర్కొన్నారు.

అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసే కోచ్‌లకు కేవలం రూ.19,500 వేతనంగా ఇస్తున్నారని, తక్షణం వీరికి మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కోచ్‌లకు ఐదు నెలలుగా వున్న వేతన బకాయిలు వారు కోరారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కోచ్‌లను తక్షణం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇంజక్షన్ల శాంపిల్స్ టెస్టింగ్‌కు పంపిస్తాం

• డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి • అస్వస్థతకు గురైన వారంతా ఆరోగ్యంగానే ఉన్నారు : ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 23 మంది రోగులు అస్వస్థకు గురైన నేపథ్యంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కల్యాణి బుధవారం విచారణ చేపట్టారు. ఇంజక్షన్ శాంపిల్స్‌ను టెస్టింగ్‌కు పంపిస్తామని తెలిపారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన పలువురు జ్వర పీడితులు, బాలింతలు, పిల్లలు, డయోరియా బాధితులు మూడు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యాన నర్సులు రోగులకు సిఫోటాక్సిమ్, మెట్రోజల్ ఇంజక్షన్లు ఇచ్చారు. కొద్ది సేపటికే రోగులు జ్వరం, వణుకు, వాంతులతో అవస్థలు పడ్డారు. డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి తక్షణం స్పందించి అస్వస్థతకు గురైన 23 మందిని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించారు.

వీరిలో సింహాద్రి పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి ఆస్పత్రికి చేరుకున్నారు. డ్రగ్స్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. రోగులకు ఇచ్చిన ఇంజక్షన్ల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష, డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ.. అస్వస్థతకు గురైన వారందరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలని సిపిఎం ధర్నా

ఇంజక్షన్లు వికటించి రోగులు అస్వస్థకు గురైన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఆస్పత్రి వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ డిఎంఅండ్ హెచ్ఒ, రిటైర్డ్ జిల్లా కో-ఆర్డినేటర్లతో వెంటనే సమగ్ర విచారణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

వర్షోత్పాతం

రుతుపవనాల తొలి వర్షాల ధాటికే దేశంలోని ప్రధాన నగరాలు అతలాకుతలం కావడం, ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి రావడం బాధాకరం. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ముంబాయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఇలా చెప్పుకుంటే ఈ వర్షాకాలం ప్రారంభంలోనే నీట మునిగిన నగరాలు ఎన్నో! రుతుపవనాలతో పాటు, వాతావరణ మార్పులు కూడా ఈ నగరాల్లో భారీ వర్షాలకు కారణం. ఢిల్లీ నగరంలోనైతే ఇటీవల కొన్ని సంవత్సరాల్లో కురవని వర్షం ఒకే రోజు కొన్ని గంటల్లో కురిసింది. దీంతో దేశ రాజధాని అల్లకల్లోల్లమైంది. ముంబాయిలో దారుణ పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మహా నగరంలోని 24 రెవిన్యూ డివిజన్లు నీట మునిగాయి. సోమవారం తెల్లవారుజాము ఒంటిగంట నుండి ఉదయం ఏడు గంటల వరకు 300 మి.మీ భారీ వర్షం కురిసింది. 2019 తరువాత ఒక్క రోజులో ఈ స్థాయిలో వర్షం కురవడం ఇదే మొదటిసారి! దీంతో ముంబైవాసుల పరిస్థితి దారుణంగా మారింది. మిగిలిన మహా నగరాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక చిన్నా, చితక పట్టణాల సంగతి చెప్పనవసరం లేదు. వర్షాకాల ప్రారంభంలోనే ఇంత భయంకరమైన పరిస్థితులు ఎదురైతే, రాబోయే రోజుల్లో ఎలా ఉంటుంది? సాధారణ వర్షాలకు తోడు తుపాన్లు వాటితో పాటు వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకునే క్లౌడ్ బరస్ట్‌ల వర్షోత్పాతాలు...వీటన్నింటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వర్షాకాల ప్రారంభంలోనే నీటమునిగిన ఈ మహానగరాలే కొద్ది రోజుల కిందటి వరకు తీవ్రమైన వేసవి తాపానికి గురయ్యాయి. మండు టెండల ధాటికి ఈ నగరాల ప్రజానీకం సమిధల్లా మాడిపోయారు. ఉధృతమైన వడగాలుల కారణంగా వందలాది మంది మరణించారు. అధికారిక లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 40 వేలకు పైగా వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మరింత పెరుగుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అంటే భారీ ఉష్ణోగ్రతలతో పాటు, తీవ్ర వర్షపాతాలను కూడా ఎదుర్కోక తప్పని స్థితి నెలకొంది. ఇది ఎప్పుడో సుదూర భవిష్యత్తులో చోటుచేసుకునే పరిణామం కాదు. ఇప్పుడు మనందరం అనుభవిస్తున్నదే! భవిష్యత్తులో మరింత తీవ్రంగా.. మరింత ఘోరంగా ఈ పరిస్థితులు మారనున్నాయి. ఈ వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు సన్నద్ధమౌతున్నాయా? అవసరమైన చర్యలను తీసుకుంటున్నాయా?

వాతావరణ మార్పుల వల్ల ప్రతి ఒక్కరు ప్రభావితమవుతారు. కానీ, తుఫాన్లు, వరదలు, వడగాడ్పులు, అతి శీతల గాలుల ప్రభావం మురికివాడల్లో నివసించే పేదల మీద మరింత తీవ్రంగా ఉంటుంది. కానీ, గేటెడ్ కమ్యూనిటీలు, ధనవంతులు నివసించే ప్రాంతాలపై చూపే శ్రద్ధ మురికివాడల మీద ప్రభుత్వాలు చూపించవు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లోని మురికివాడల జనాభా 65 మిలియన్లు! మహారాష్ట్ర, సమైక్య ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఈ మూడు రాష్ట్రాల్లోనే దేశంలోని మురికివాడల జనాభాలో మూడవ వంతు (28.4 మిలియన్లు) మంది నివసిస్తున్నారు. ఒడిషా వంటి చిన్న రాష్ట్రంలోనూ 1.5 మిలియన్ మంది మురికివాడల ప్రజానీకం ఉన్నారు. సాధారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉండే ఈ మురికివాడలు స్వల్ప వర్షానికే నీట మునుగుతుంటాయి. తాజా వర్షాల్లోనూ అదే జరిగింది. ఇష్టం వచ్చినట్లుగా జరుగుతున్న నిర్మాణాలతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక మురికివాడల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ఇక క్లౌడ్ బరస్ట్ వంటి వైపరీత్యాలు చోటుచేసుకుంటే ఇక్కడ నివసించే సామాన్యుల పరిస్థితి ఏమిటి? సహాయక శిబిరాల అగచాట్లు ఇంకా ఎన్నాళ్లు? ఉత్పాతాలు పెరుగుతుండటంతో ఈ శిబిరాల సంఖ్యను ప్రతి ఏటా పెంచాల్సి వస్తోంది. నగరాల మనుగడకు ఈ మురికివాడలే కీలకం. మరో మాటలో చెప్పాలంటే నగరాలను నిర్మించి, అభివృద్ధి చేసేది వీరే! ఆ ఇళ్లలో పనివారు నివసించేది ఇక్కడే. ప్రభుత్వాలు తక్షణం వీరిపై దృష్టి సారించాలి. మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు జీవనోపాధిని గ్యారంటీ చేయాలి. మురికివాడల ప్రజానీకాన్ని విస్మరించి, అభివృద్ధి ప్రణాళికలు అమలు చేసే నగరాలు వాతావరణ న్యాయాన్ని, సుస్థిరతను అందుకోలేవన్న సత్యాన్ని పాలకులు గమనించాలి.

మహనీయుల మాట



అన్నింటికీ మించిన నేరం
అన్యాయంతోనూ, అక్రమాలతోనూ
రాజీ పడటమే.
- నేతాజీ సుభాష్ చంద్రబోస్

కాంట్రాక్టీకరణ, కాషాయీకరణల 'అగ్నిపథ్'

విశ్లేషణ



వి. రాంభూపాల్

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం 'అగ్నిపథ్' పేరుతో మోడీ ప్రభుత్వం సైనిక నియామకాల్లో కాంట్రాక్టీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వానికి భుజం కాస్తూ, మూడోసారి మోడీ ప్రధాని కావడానికి కారణమైన నితీష్ కుమార్ ఈ అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం గురించి పున:సమీక్షిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల లీకేజీ వార్తలు ఇస్తున్నది. పార్లమెంట్‌లో చర్చ లేకుండా, నిపుణులతో సంప్రదించకుండా, ఏకపక్షంగా, ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన నోట్ల రద్దు, లాక్‌డౌన్ లాగే ఈ అగ్నిపథ్ పథకం కూడా బెడిసికొట్టిందా?

ఆఫీసర్ ర్యాంకుకు కింది స్థాయిలో వున్న సైనిక నియామకాల కోసం కేంద్రం 2022 జూన్ 14న 'అగ్ని పథ్' పథకాన్ని ప్రవేశ పెట్టి, సెప్టెంబర్ నుండి నియామకాలు చేపట్టింది. ఈ పథకం ద్వారా నియమించబడే సైనికులను కొత్త సైనిక ర్యాంకు కింద 'అగ్ని వీర్' లని పిలుస్తున్నారు. మెడికల్ బ్రాంచీల్లోని టెక్నికల్ కేడర్ మినహా అన్ని రంగాల్లో సైనికులు ఈ పథకం కింద సేవలకు యువత నియమితులవుతున్నారు. గతంలో సైనిక ఉద్యోగమంటే దేశభక్తితో కూడుకున్నదని, డ్యూటీలో మరణిస్తే అది వీరమరణం అవుతుందని, రిటైర్‌మెంట్ తర్వాతి జీవితానికి భరోసా వుంటుందనే నమ్మకంతో సంవత్సరానికి 75 వేల మంది యువత సైన్యంలో చేరేవారు. అలాంటి ఆలోచనలకు పూర్తిగా భిన్నమైంది ఈ 'అగ్ని పథ్' పథకం. అమెరికాలో అమలవుతున్న వాలంటరీ టూర్ ఆఫ్ డ్యూటీ (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే విధానం నుండి ఈ 'అగ్ని పథ్' పథకాన్ని రూపొందించారు. అమెరికాతో పాటు ఇజ్రాయిల్, నార్వే, ఉత్తర కొరియా, సింగపూర్, స్వీడన్ దేశాల్లో ఇలాంటి విధానం అమలవుతున్నది. ఈ ప్రయోగం ఆచరణలో విఫలమైందని ఈ దేశాలన్నీ గుర్తించి సవరించుకుంటున్న స్థితిలో మన దేశంలో ఈ పథకం అమలులోకి వచ్చింది. 'అగ్ని పథ్' పథకంలో ప్రైవేటీకరణ విధానాలు, కాషాయదళ ప్రయోజనాలు కలగలిసి వున్నందున ఈ రెండింటి నుండి మద్దతు వుంది.

సైన్యంలో ప్రైవేటీకరణ

సాయుధ దళాలను యవ్వనంగా ఉంచడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రస్తుత సాయుధ దళాల సగటు వయసు 32 ఏళ్ళు వుందని, దాన్ని 26 ఏళ్ళకు తీసుకు రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అందుకోసమే 'అగ్ని పథ్' ద్వారా 17.5 సంవత్సరాల నుండి 21 (తర్వాత దీన్ని 23 సంవత్సరాలకు పెంచారు) సంవత్సరాల లోపు వయసు వున్న యువతను సైన్యంలో నియమిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా నియమించబడిన 'అగ్ని వీర్'లు సివిల్ వర్క్ ఫోర్స్‌గా వుంటూ దేశానికి అవసరమైన సైనిక సేవలు చేస్తారట! ఈ మాటలన్నీ వినసొంపుగా వున్నా, ఈ పథకం అసలు ఉద్దేశ్యం సైన్యంలో కాంట్రాక్టీకరణ విధానాన్ని అమలు చేయడం.



ఈ పథకం అసలు ఉద్దేశ్యం సైన్యంలో కాంట్రాక్టీకరణ విధానాన్ని అమలు చేయడం. శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడి, ఉద్యోగ విరమణ తర్వాత ఏ రక్షణ లేకుండా వీధుల్లోకి గెంటివేసే కాంట్రాక్టీకరణ విధానం 1991 తర్వాత అన్ని రంగాల్లో వేగంగా అమలవుతున్నది. ప్రైవేటీకరణ బకాసురుడి ఆకలికి ఇప్పుడు సైనిక రంగం ఆహారం అవబోతున్నది. ఈ పథకం కింద నియమించే 'అగ్నివీర్'లకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి, నాలుగు సంవత్సరాల ఉద్యోగం ఇస్తారు. ఇలా ప్రతి సంవత్సరం ఎంపిక అయ్యే 42,000 మంది అగ్నివీర్ లలో 25 శాతం మందికి మాత్రమే 15 సంవత్సరాల కొలువుకు అవకాశం వుంటుంది. వీరికి మాత్రమే పింఛన్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు వుంటాయి. ఇలా బయటకు వచ్చిన ఈ అగ్నివీర్‌లు మహా నగరాల్లో, నగరాల్లో వుండే కార్పొరేట్ ఆఫీసుల దగ్గర, కోటీశ్వరుల బంగ్లాల దగ్గర సెక్యూరిటీ గార్డులుగా పని చేసే అవకాశం కోసం ఎదురు చూస్తూ బతకాలి.

ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయాలకు, మత ఘర్షణలకు వినియోగిస్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్‌ఎస్‌ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్‌ఎస్‌ఎస్ బలపరుస్తుంది.

శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడి, ఉద్యోగ విరమణ తర్వాత ఏ రక్షణ లేకుండా వీధుల్లోకి గెంటివేసే కాంట్రాక్టీకరణ విధానం 1991 తర్వాత అన్ని రంగాల్లో వేగంగా అమలవుతున్నది. ప్రైవేటీకరణ బకాసురుడి ఆకలికి ఇప్పుడు సైనిక రంగం ఆహారం అవబోతున్నది. ఈ పథకం కింద నియమించే 'అగ్నివీర్'లకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి, నాలుగు సంవత్సరాల ఉద్యోగం ఇస్తారు. ఇలా ప్రతి సంవత్సరం ఎంపిక అయ్యే 42,000 మంది అగ్నివీర్ లలో 25 శాతం మందికి మాత్రమే 15 సంవత్సరాల కొలువుకు అవకాశం వుంటుంది. వీరికి మాత్రమే పింఛన్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు వుంటాయి. ఈ పథకం కింద నియమితులైన సైనికులకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండవ సంవత్సరం రూ.33 వేలు, మూడో సంవత్సరం రూ.36,500, నాలుగో సంవత్సరం రూ.40 వేల వేతనం ఇస్తారు. ఈ వేతనంలో నుండి 30 శాతాన్ని కార్పస్‌ఫండ్‌కు జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం మరో 30 శాతాన్ని ఇందుకు జమ చేస్తుంది. నాలుగో సంవత్సరం పూర్తయ్యే నాటికి ఈ మొత్తం రూ. 10.04 లక్షలు అవుతుంది. 75 శాతం మంది అగ్నివీర్‌లకు ఈ మొత్తాన్ని రిటైర్‌మెంట్ ప్యాకేజీగా ఇచ్చి ఇంటికి పంపుతారు. ఇలా బయటకు వచ్చిన ఈ అగ్నివీర్‌లు మహా నగరాల్లో, నగరాల్లో వుండే కార్పొరేట్ ఆఫీసుల దగ్గర, కోటీశ్వరుల బంగ్లాల దగ్గర సెక్యూరిటీ గార్డులుగా పని చేసే అవకాశం కోసం ఎదురు చూస్తూ బతకాలి. ఇప్పటికే 'దయార్ద్ర హృదయులు' అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల యజమానులు, కంగనా రనౌత్ లాంటి సెలబ్రెటీలు అగ్నివీర్‌లకు అవకాశం ఇస్తామని 'గొప్ప మనసు'తో ముందుకు వచ్చారట! ఇన్నాళ్ళుగా మనం గుండెల నిండా గాలి పీల్చుకుని అరచిన 'జై జవాన్' నినాదం పాతబడి రానున్న రోజుల్లో కనుమరుగు కానుందన్న మాట!

ఇప్పటికే రిటైర్ అయిన లక్షలాది మాజీ సైనికోద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాజస్థాన్‌లో 53,373 మంది మాజీ సైనికులు ఉద్యోగాల కోసం అర్జీలు పెట్టుకోగా కేవలం 1415 మందికి మాత్రమే (2.6 శాతం) ఉపాధి దొరికింది. ఉత్తరప్రదేశ్‌లో 86,192 మందికి గాను 1616 మందికి (1.8 శాతం), పంజాబ్‌లో 60,772 మందికి గాను 1150 మందికి (1.8 శాతం), బీహార్‌లో 43,845 మందికి గాను కేవలం 6 మందికి (0.01 శాతం) మాత్రమే ఉపాధి అవకాశాలు దొరికాయి. ప్రస్తుతం ప్రతి సంవత్సరం సుమారు 75,000 మంది సైనికులు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి తోడు ప్రతి నాలుగు సంవత్సరాలకు 30 వేల మంది (అగ్ని పథ్ కింద నియమితులైన వారిలో 75 శాతం మంది) అగ్నివీర్‌లు తాత్కాలిక ఉద్యోగం నుండి బయటకు వస్తారు. వీరందరికి ఉపాధి ఎవరు కల్పిస్తారు? ఎక్కడ కల్పిస్తారు?

2022లో ఏర్పాటు చేయబడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 'ఆన్ డిఫెన్స్ రిపోర్టు' ప్రకారం 2025 నాటికి రక్షణ శాఖ పెన్షనర్ల సంఖ్య సుమారు 26 లక్షలు కాగా, వారి పెన్షన్ బిల్లు రూ.2.5 లక్షల కోట్లు అవుతుందని అంచనా. ఈ సంవత్సర రక్షణ బడ్జెట్ రూ.6,21,541 కోట్లు. ఇందులో రెండున్నర లక్షల కోట్లు అంటే సుమారు 40 శాతం పెన్షన్లకే ఖర్చు అవుతుందనే పేరుతో సైనికులకు పెన్షన్ అమలు చేయకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన సైనికులు రిటైర్‌మెంట్ తర్వాత గౌరవంగా జీవించే హక్కును కాలరాయడానికే ఈ విధానాన్ని బిజెపి తీసుకు వచ్చింది. సైన్యంలో కూడా తాత్కాలిక ఉద్యోగాలు, పెన్షన్ లేని రిటైర్‌మెంట్ విధానాలు అమలు కావడం కార్పొరేట్ కంపెనీలకు అదనపు బలం, అందుకే ఈ పథకానికి ఆ కంపెనీలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపాయి.

కాషాయీకరణ

రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం ద్వారా హిందూ రాజ్య నిర్మాణం చేయాలనేది ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. 1925లో స్వయం సేవక్ పేరుతో ఏర్పడిన ఈ సంస్థ ప్రతి రోజు తన సభ్యులకు శాఖ ద్వారా వ్యాయామంతో మొదలుపెట్టి, కర్ర సాము, ఆయుధాల శిక్షణ వరకు సైనిక తరహాలో శిక్షణ ఇస్తుంది. ఈ శిక్షణ లక్ష్యం మత విద్వేషం ప్రాతిపదికగా సాయుధ సైనిక బృందాలను తయారు చేయడం. 1938లోనే ఇందుకోసం భోంస్లా అనే ప్రాంతంలో మిలిటరీ స్కూల్ ప్రారంభించారు. అది ఇప్పటికీ నడుస్తోంది. ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయాలకు, మత ఘర్షణలకు వినియోగిస్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్‌ఎస్‌ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్‌ఎస్‌ఎస్ బలపరుస్తుంది.

సైన్యంలో కీలకమైన మార్పు చేసే అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశ పెట్టే ముందు దీని పర్యవసానాల గురించి నిపుణులతో కనీసం చర్చించకపోవడం సరికాదని పరమ వీరచక్ర కెప్టెన్ బాణా సింగ్ అభ్యంతరం తెలిపారు. ఈ పథకం అమలు వల్ల అనేక కష్టాలు వస్తాయని నావిక స్టాఫ్ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాష్, ఆర్మీ స్టాఫ్ మాజీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజ్ కద్యస్ లాంటి అనేక మంది మాజీ సైనిక ఉన్నతోద్యోగులు అభిప్రాయపడ్డారు. అయినా వీటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా మోడీ ప్రభుత్వం 'అగ్ని పథ్' పథకాన్ని అమలులోకి తెచ్చింది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి కి తీవ్ర ఎదురుదెబ్బ తగలడానికి నిరుద్యోగం కీలక కారణమైంది. సైన్యంలో ఎక్కువ భాగం నియమితులయ్యే యు.పి, హర్యానా, పంజాబ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో బిజెపి ఘోరంగా దెబ్బతింది. అందుకే నితీష్ కుమార్ అగ్నిపథ్ పథకం గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కరోనా లాక్‌డౌన్ ఫలితంగా చిన్న పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతబడడం, జిఎస్‌టి పన్నుల విధానం, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల పోటీకి మధ్యతరహా పరిశ్రమలు గిలగిలలాడు తుండడం, ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ తిరోగమన బాట పట్టడంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ తాజా నివేదిక 2015-2023 మధ్య 13 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని తయారీ రంగంలోని అసంఘటిత రంగ యూనిట్లలో పని చేస్తున్న 54 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారనే కఠోర వాస్తవాన్ని బయటపెట్టింది. ఉన్నత చదువులు కొనలేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రతి సంవత్సరం 75 వేల మంది సైన్యంలో చేరి బతుకుతున్నారు. ఈ 'అగ్ని పథ్' వల్ల కేవలం 40 వేల మందికి మాత్రమే తాత్కాలిక ఉద్యోగాలు వస్తాయి. సుమారు 35 వేల మంది సైనిక ఉపాధి కోల్పోతారు. ప్రస్తుతం వున్న నిరుద్యోగ సైన్యానికి వీరు అదనంగా తోడవుతారు.

సర్వరోగ నివారిణిగా ప్రచారం చేసిన ప్రైవేటీకరణ ఇప్పటికే అనేక రంగాల్లో సర్వరోగాల నిలయంగా మారింది. ఇప్పుడు సైన్యంలోకి కూడా ఈ రోగం విస్తరించింది. పౌర జీవితంలో రగిల్చే మత విద్వేషాలను మరింత పెంచి పోషించేందుకు సైనిక రంగానికి కషాయ రాజకీయాలు విస్తరిస్తున్నాయి. సైన్యంలోకి ప్రైవేశ పెట్టిన కాంట్రాక్టీకరణ, కాషాయీకరణ విధానాలను అడ్డుకోవడం దేశ పౌరులందరి కర్తవ్యం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

జనవాక్యం

సంకీర్ణాలే నేటి ట్రెండ్

ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా ఫలితాలు వచ్చాయి. ఏ ఒక్క పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. యూరోపియన్ యూనియన్‌కి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఫ్రాన్స్‌లో జనాదరణ కలిగిన లీ పెన్ సారథ్యంలో నడుస్తున్న మితవాద పార్టీ మంచి ఫలితాలు రాబట్టింది. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అవే ఫలితాలు పునరావృతమైతే ఇబ్బంది అని భావించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ముందస్తు ఎన్నికలకు పచ్చ జండా ఊపారు. తన పార్టీ బలం పెరిగి తన అధికారానికి స్థిరత్వం వస్తుందన్న ఆశతో. అయితే అలా జరగలేదు. అలా అని మితవాద పార్టీల గ్రూపు కూడా సానుకూల ఫలితాలు పొందలేదు. మొదటి విడతలో మితవాద పార్టీల గ్రూప్ ముందంజ వెయ్యడం గమనించి వామపక్షాలు జాగ్రత్త పడ్డాయి. మితవాద పార్టీల వ్యతిరేక ఓటు చీలకుండా ఎక్కడికక్కడ సర్దుబాట్లు చేసుకుని, తమ అంతర్గత వ్యవహారాల్ని చక్కబెట్టుకుని ఏక తాటిపై వచ్చాయి. ఫలితంగా వామపక్షాల గ్రూపు ఎన్నికల్లో పై చేయి సాధించింది. ఇప్పుడు అక్కడ రెండో స్థానంలో ఉన్న అధ్యక్షుడి పార్టీ సెంట్రిస్ట్ గ్రూప్‌తో కలిస్తే అధికారం కైవసం అవుతుంది. మూడో స్థానంతో సరిపెట్టుకున్న మితవాద పార్టీలతో అధ్యక్షుడికి రానున్న కాలంలో బలమైన సవాళ్ళు తప్పనందున ఇప్పుడు ఆయన వామపక్షాలకు పూర్తిగా సహకరించక తప్పదు. ఆర్థికం, వలస విధానం తదితర విషయాల్లో ఉన్న భిన్నాభిప్రాయాల్ని చర్చల ద్వారా తగ్గించుకోక తప్పదు. త్వరలో ఆ దేశం ఒలింపిక్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నందున ఈ లోగా స్థిరమైన ప్రభుత్వం ఏర్పడేలా అధ్యక్షుడే చొరవ తీసుకోవాల్సి ఉంది. ఒలింపిక్స్‌లో పరుగుల పోటీ కన్నా ముందే ఆయన రాజకీయ పరుగు పోటీ మొదలైంది. ముందస్తు ఎన్నికల ద్వారా ఆయన తన పరుగును ముందే స్టార్ట్ చేశారు.

-డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ.

మోడీ రష్యా పర్యటన-పశ్చిమ దేశాల అక్కసు !

వ్యాఖ్య

ప్రధాని నరేంద్ర మోడీ సోమ, మంగళ వారాల రష్యా పర్యటన జయప్రదంగా ముగిసింది. రక్షణ ఒప్పందంతో సహా పూర్వపు సోవియట్ యూనియన్‌తో ఏర్పడిన బంధం...అది విచ్ఛిన్నమైన తరువాత వారసురాలిగా వున్న రష్యాతో కూడా జయప్రదంగా కొనసాగుతున్నది. పాకిస్తాన్‌కు ఆధునిక ఆయుధాలు ఇచ్చి మన మీద ఉసికొల్పిన అమెరికాకు పోటీగా... మనకు అవసరమైన మిలిటరీ సాయంతో పాటు అంతరిక్ష ప్రయోగాలలో కీలకమైన క్రయోజెనిక్ ఇంజన్ల పరిజ్ఞానంతో సహా అనేక రంగాలలో...రెండు దేశాల అనుబంధం కొనసాగుతోంది. ఉక్కు, ఔషధ, ఇతర రంగాలలో మనం పొందిన సాయం కూడా తక్కువేమీ కాదు. ఇప్పటికీ మిలిటరీ ఆయుధాలు, పరికరాల అంశంలో రష్యాపైనే ప్రధానంగా ఆధార పడుతున్నాము. ప్రపంచ శ్రేణి క్షిపణి 'బ్రహ్మోస్' తయారీలో రష్యా భాగస్వామిగా ఉంది. ఎ.కె రకం మర తుపాకుల తయారీలో భాగస్వామ్యం వుంది. ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద గ్రంథమే అవుతుంది. ఇంతగా పెనవేసుకుపోయిన రెండు దేశాలనూ విడదీయాలని, తన ఆయుధాలను మనకు అంటగట్టాలని గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా చేయని పని లేదు. ఈ పూర్వ రంగంలో మోడీ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పశ్చిమ దేశాల పాటలకు అనుగుణ్యంగా భారత్ నృత్యం చేసేందుకు సిద్ధంగా లేదన్న సందేశం పంపినట్లుగా చెప్పవచ్చు. దీని అర్థం వాటి నుంచి దూరంగా జరగటంగా భావించకూడదు.



అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం ఏదైనా ఉంటే అది మన దేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభంలో తమ వైపుకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామో అన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది.

గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రను చూసినపుడు కొన్ని సందర్భాలలో ఏదో ఒక శిబిరం వైపు మొగ్గు చూపినట్లు కనిపించినా, ఆ మేరకు కొన్ని చర్యలున్నా భారత పాలక వర్గాలు అలీన విధానం పాటిస్తూ అటు సోషలిస్టు శిబిరం ఇటు పెట్టుబడిదారీ కూటమి నుంచి కూడా లబ్ధి పొందేందుకు చూడటం తెలిసిందే. ఉదాహరణకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా మనలను తన వైపు లాగేందుకు చూస్తున్నది. దానిలో భాగంగానే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన కూటమి (క్వాడ్, చతుష్టయం)లో భారత్‌ను కూడా చేర్చుకున్నారు. అయితే 2020లో గాల్వన్ సరిహద్దు ఘర్షణ తరువాత కూడా చైనా నుంచి దిగుమతుల అంశంలో భారత్ గత రికార్డులతో పాటు నరేంద్ర మోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారు. పెట్టుబడులను అడ్డుకొనేందుకు చూసినా తాజాగా విద్యుత్ వాహనాల రంగంలో చైనా పెట్టుబడులను కూడా అనుమతించేందుకు వైఖరిని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇది మన కార్పొరేట్ల ప్రయోజనాల కోసమని వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల ఆంక్షలు, బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చౌక ధరలకు మన దేశం చమురు కొని పరోక్షంగా రష్యాను ఆర్థికంగా ఆదుకున్నది. దీన్ని పశ్చిమ దేశాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. మన కార్పొరేట్లు రష్యా చమురు ఉత్పత్తులను చౌకధరలకు ఐరోపా దేశాలకు విక్రయించి లబ్ధి పొందుతున్నాయి.

అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం ఏదైనా ఉంటే అది మన దేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభంలో తమ వైపుకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామో అన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది. రష్యాతో సంబంధాలపై తమకున్న ఆందోళనలతో సహా అనేక అంశాలపై ఎలాంటి శషభిషలు లేకుండా భారత్‌తో చర్చించినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. రష్యాతో వ్యవహరించే ఏదేశానికైనా తాము ఇదే చెబుతామన్నాడు. నాటో కూటమి 75వ సమావేశాలు జరుగుతున్న తరుణంలో మూడవ సారి అధికారానికి వచ్చిన తరువాత నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బ తీసేందుకు తంపులు పెట్టాలని, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు చూస్తున్నాయనే అంశాన్ని గమనంలో ఉంచుకోవాలని, వాటి వలలో పడవద్దని చైనా హితవు పలికింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కవిత్వం

ఊపిరితో ఆడిన ఆట

ఆ ఆఖరి రోజు
కాపు కాచి ప్రకృతి అందాన్ని ఎర వేసి పిలిచినట్లు
ఆనందం పెందలకడనే నిద్ర లేచి
జలపాతం ఒడిలో
నీటిని ముద్దడాలని హద్దులు మరిస్తే..

ఆ నీరే విషాదమై పారి
యమ పాశమై క్షణాల్లో
చావు కళ్లెదుట కనిపించి
రోదించే ప్రాణాలని చూస్తూ...

కొండలు కార్చిన కన్నీటికి
మరింత ఉధృతంగా మారి
ఊపిరితో ఆడిన ఆటలో
బతుకులను మాయం చేసిన మృత్యువా?

నీ ఈ కోపం ఎక్కడిది?
నీ ఈ కసాయితనం ఎందుకు?
నీ చేతుల్లో ముగిసిన విహార యాత్ర
కొద్ది క్షణాల్లో అంతిమ యాత్రని
ఊహించని విషాద యాత్ర ఓ హెచ్చరిక.

ప్రకృతి ప్రేమలో
మనసు మసక బారకూడదని
మనిషి బలి కాకూడదని...!
(మహారాష్ట్రలోని లోనావాలా జలపాతంలో కొట్టుకుపోయిన కుటుంబాన్ని తలచుకుని)

- చందలూరి నారాయణరావు,
సెల్ : 9704437247

కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు

- **నాలుగేళ్ల తరువాత**
  పట్టిసీమ నుంచి నీటి విడుదల



ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల కార్యక్రమంలో మంత్రులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఖరీఫ్‌లో వరి సాగు నిమిత్తం గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర బుధవారం ప్రకాశం బ్యారేజీ నుంచి బుధవారం విడుదల చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి వద్ద డెల్టా ప్రధాన రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు మంత్రులు పూజలు చేశారు. అనంతరం రెగ్యులేటర్ గేట్లు తెరచి 500 క్యూసెక్కుల నీటిని తూర్పు డెల్టాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ జగన్ హయంలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు 20ఏళ్లు వెనక్కిపోయాయని తెలిపారు. పట్టిసీమతోపాటు తాడిపూడి, పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల మరమ్మతు, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టిసీమ గోదావరి జలాలు కృష్ణా నదికి చేరకుంటే కృష్ణా డెల్టాకు సంబంధించి 40 లక్షల మందికి పైబడి వలసలకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడేదని పేర్కొన్నారు. పట్టిసీమ వట్టిసీమ అన్న మాజీ సిఎం జగన్ నాలుగేళ్లపాటు డెల్టా రైతులను ఇబ్బంది పెట్టారని, ఇందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేశామని తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పులిచింతల, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఐదేళ్లు పూడిక తీయకపోవడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో పులిచింతల నిర్వహణ అధ్వానంగా ఉండడం వల్ల నేడు ఈ జలాశయం ఎండిపోయిందని తెలిపారు. 40 టిఎంసిలు నిల్వ ఉండాల్సిన పులిచింతలలో 0.5 టిఎంసిల కన్నా తక్కువ నీరు నిల్వ ఉందన్నారు. చివరి ఎకరా వరకు నీళ్లు ఇచ్చేందుకు టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ నారాయణ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ ఉమామహేశ్వరరావు, ఇఇ మల్లికార్జున, రాష్ట్ర అపెక్స్ మాజీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళి కృష్ణ, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుప్తా శివరామకృష్ణ, టిడిపి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



అస్సాంలో తగ్గిన వరద ఉధృతి

- **92 చేరిన మృతుల సంఖ్య**

గౌహతి : అస్సాంలో వరద పరిస్థితి కొద్దిగా తగ్గింది. అయితే తాజాగా మరో ఏడుగురు మరణించారు. దీంతో మొత్తంగా వరద సంబంధిత మరణాల సంఖ్య 92కు చేరుకుంది. అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎఎస్‌డిఎంఎ) బుధవారం విడుదల చేసిన వివరాల ప్రకారం వరద ప్రభావిత జిల్లాల సంఖ్య వారం కిందట 30 ఉండగా, మంగళవారం నాటికి 26కి తగ్గింది. "26 వరద బాధిత జిల్లాల్లోని 2,779 గ్రామాల్లో దాదాపు 17.18 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 39,870.3 హెక్టార్ల పంట భూములు మునిగిపోయాయి. ప్రస్తుతం 507 సహాయ శిబిరాల్లో దాదాపు లక్ష మంది ఆశ్రయం పొందుతున్నారు' అని ఎఎస్‌డిఎంఎ పకటనలో తెలిపింది. బ్రహ్మపుత్ర, బుర్హిదిహింగ్, దిఖౌ, దిసాంగ్, కోపిలి, కుషియారా వంటి నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయని అధికార ప్రతినిధి తెలిపారు. కజరింగా నేషనల్ పార్క్, టైగర్ రిజర్వ్‌లో వరద నీరు తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. అయితే ఇంకా వరద ప్రభావం ఉందని చెప్పారు.

గాజాలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ కార్యాలయాలే లక్ష్యం

- **నాలుగు స్కూలు భవనాలు, మూడు ఆస్పత్రులపై దాడులు**
- **27మంది మృతి**
- **ఇలా అయితే చర్చలు కష్టమేనన్న హమాస్**



గాజాలో ఇజ్రాయిల్ బాంబు దాడిలో చనిపోయిన పిల్లవాడి మృత దేహాన్ని ఆసుపత్రి నుంచి బయటకు తీసుకొస్తున్న దృశ్యం

గాజా : గాజా నగరంలోని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ప్రధాన కార్యాలయాలపై వైమానిక దాడులు చేస్తామని, ప్రజలందరూ నగరం నుండి ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ ఆర్మీ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎక్కడ ఆశ్రయం దొరుకుతుందా అని వెతుకుతూ వేలాదిమంది తరలిపోతుండడం కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాలన్నీ ప్రమాదకరమైన జోన్‌లుగా మారతాయని ఈలోగా అందరూ అక్కడ నుండి వెళ్ళిపోవాలని ఆర్మీ ఇప్పటికే హెచ్చరించింది. దాడుల్లో ఖాన్ యూనిస్ నగరం శిధిలాల దిబ్బగా మారడంతో అక్కడి ప్రజలు గాజాలో తల దాచుకున్న స్కూలు భవనంపై మంగళవారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 27మంది మరణించగా, 53మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో మొత్తంగా నాలుగు స్కూలు భవనాలు దాడులకు గురై తీవ్రంగా ధ్వంసమవగా, మూడు కీలకమైన ఆస్పత్రులు కూడా మూతపడ్డాయి. వేలాదిమంది పాలస్తీనియన్లు ఇతర ప్రాంతాలకు పారిపోయారు. స్కూళ్ళపై దాడులను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ చట్టాలను ఈ దాడులు తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ చీఫ్ ఫిలిప్ లాజారిని ఖండించారు. సెంట్రల్, పశ్చిమ రఫాల్లో కూడా ఇజ్రాయిల్ ముమ్మరంగా దాడులు జరుపుతోంది. ఈజిప్ట్‌లో చర్చల అనంతరం ఖతార్‌లో బుధవారం నుండి కాల్పుల విరమణ ఒప్పందంపై మరోసారి చర్చలు ప్రారంభమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. 9మాసాలుగా సుదీర్ఘంగా సాగుతున్న దాడులతో గాజా నగరంలో మెజారిటీ ప్రాంతాలు, చుట్టుపక్కల ప్రాంతాలు నేలమట్టమయ్యాయి. ఎక్కడా భవంతి అనేది కనిపించడం లేదు. దక్షిణ గాజాలో చాలామంది ప్రజలు యుద్ధ భయంతో ముందుగానే పారిపోగా, ఉత్తర ప్రాంతంలో ఇంకా వేలాదిమంది వున్నారు. 'కదులుతున్న దేనిపైన అయినా దాడి చేస్తున్నారు. దాడులు చాలా ఉధృతంగా సాగుతున్నాయి." అని గాజా నగరంలోని తుఫా జిల్లా నుండి పారిపోయిన ఒక వ్యక్తి వ్యాఖ్యానించారు. సెంట్రల్ జిల్లాల్లోకి ట్యాంకులు ప్రవేశించాయన్నారు. కాగా ఈ దాడులన్నీ కాల్పుల విరమణ, బందీల విడుదలపై చర్చల ప్రక్రియకు విఘాతం కలిగిస్తాయని హమాస్ హెచ్చరించింది.

హత్యా రాజకీయాలు వీడని వైసిపి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు ఛీకొట్టినా హత్యా రాజకీయాలను వైసిపి వీడలేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా, కంబదూరు మండలం, మెచ్చిరిలో తమ పార్టీ కార్యకర్త గొల్ల ఆదెప్ప హత్య బాధాకరమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి బాటలోనే వైసిపి రౌడీ మూకలు పయనిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదెప్ప కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

వైసిపి పాలనలో అన్ని రంగాలూ వెనక్కు : యనమల

ఐదేళ్ల వైసిపి పాలనలో అన్ని రంగాలూ వెనక్కు వెళ్లిపోయాయని మాజీ మంత్రి, టిడిపి ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు విమర్శించారు. తమ ప్రభుత్వం గుర్తించిన గ్రీన్ ఇంజనీరింగ్ పోలవరం, నదుల అనుసంధానం, రాజధాని అమరావతి నిర్మాణం, విద్యుత్, పారిశ్రామిక రంగాలు తదితరాలను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకపై వైసిపి దుష్ప్రచారం చేస్తోందని టిడిపి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుదేలైన నిర్మాణ రంగానికి పునర్జీవం కల్పించడానికి, లక్షల మంది కార్మికులకు ఉపాధిని తిరిగి పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని వివరించారు. లోడింగ్, రవాణా ఛార్జీలను మాత్రమే వసూలు చేసి ఇసుక అందిస్తున్నామని తెలిపారు.

13 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు ప్రశాంతం

న్యూఢిల్లీ : ఏడు రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బాగ్దా, మానిక్తలా (పశ్చిమ బెంగాల్), బద్రీనాథ్, మంగళౌర్ (ఉత్తరాఖండ్), జలంధర్ వెస్ట్ (పంజాబ్), డెహ్రా, హమీర్పూర్, నలాగర్ (హిమాచల్ ప్రదేశ్), రూపౌలి (బీహార్), విక్రవాండి (తమిళనాడు), అమరవారా (మధ్యప్రదేశ్) అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు.

వేర్వేరు చోట్ల 800 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చింతూరు (అల్లూరి జిల్లా)



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో వేర్వేరు చోట్ల వాహన తనిఖీలు చేపట్టి 800 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు చింతూరు ఎఎస్‌పి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి తుహిన్‌సిన్హా వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సంజీవ్‌గెన్ను వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ గిరి, శివ దయాల్ దొరె, అలోక్ గోతం, రంజిత్ మావై, దుర్గేశ్ గోస్వామి 550 కిలోల గంజాయిని కొనుగోలు చేసి లారీలో మధ్యప్రదేశ్ తరలించేందుకు మోతుగూడెం గ్రామ శివారు అడవిలో లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అమిత్ గిరి, శివ దయాల్ దొరె, అలోక్ గోతం పోలీసులకు పట్టుబడగా సంజీవ్‌గెన్ను, రంజిత్ మావై, దుర్గేశ్ గోస్వామి పరారయ్యారు. గంజాయిని, లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీలేరు సమీపంలోని మంగంపాడు నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు 250 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మజ్జి వెంకట్ సుమంత్, సతీష్‌రెడ్డి, జనగామ్‌కు చెందిన వివేక్ గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. వెంకట్ సుమంత్ కారులో గంజాయిని తరలిస్తుండగా.. సతీష్‌రెడ్డి, వివేక్ పైలట్‌గా కారుకు ముందు వెళ్తున్నారు. పోలీసులు తనిఖీలు చేపట్టగా సతీష్‌రెడ్డి, వివేక్ పరారయ్యారు. వెంకట్ సుమంత్ పోలీసులకు పట్టుబడ్డాడు. గంజాయితోపాటు కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్‌పి తెలిపారు.

బిసి సంక్షేమ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య, భోజనం అందిస్తాం : మంత్రి సవిత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాష్ట్రంలోని అన్ని బిసి సంక్షేమ విద్యాలయాల్లో నాణ్యమైన భోజనం, విద్యను అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రసాద్, ఎంఎస్.రాజు, బండారు శ్రావణిలతో కలిసి అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2014-19లోని బిసి రెసిడెన్షియల్ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో కేవలం రెండు బిసి రెసిడెన్షియనల్ పాఠశాలలను మాత్రమే తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం బిసి, ఎస్‌సి, ఎస్‌టి రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన విద్య, భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చేనేతల అభివృద్ధి కోసం ప్రతి సోమవారం చేనేత దుస్తులు ధరించాలని ప్రజలను కోరారు.

కూతురిని చంపి తల్లి ఆత్మహత్య

- రాజకీయ బెదిరింపులే కారణమంటున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



చిన్నారితో మమత, శాంత కుమార్ (ఫైల్ ఫోటో)

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండల పరిధిలోని మల్లికార్జునపల్లి గ్రామంలో బుధవారం ఉదయం విషాద ఘటన చోటు చేసుకుంది. తొమ్మిది నెలల కూతురిని నీటితొట్టెలో వేసి, ఆపై తల్లి కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన శాంతకుమార్, మమత(25)లకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మొదటి కుమార్తె అమ్మమ్మ ఇంటి వద్ద ఉండగా రెండో కుమార్తె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. రెండు రోజుల క్రితం గ్రామంలో టిడిపి, వైసిపి మద్దతుదారుల మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో శాంతకుమార్‌పై కేసు నమోదు అవుతుందనే ప్రచారం గ్రామంలో కొనసాగింది. దీంతో భార్య మమత తీవ్ర ఆందోళనకు లోనైంది. తన భర్తను ఎక్కడ అరెస్టు చేస్తారేమో అన్న ఆందోళనతోనే బుధవారం ఉదయం తన ఇంట్లోని స్నానపు గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అంతకు ముందు తన తొమ్మిది నెలల చిన్నారిని నీటి తొట్టెలో పడేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. మమత అనారోగ్య సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు. అన్ని కోణాల్లో ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హరినాథ్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టిడిపి ఆఫీసుపై దాడి కేసులన్నీ నేడు విచారణ

- ప్రకటించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, ఆత్మకూరులోని టిడిపి ఆఫీసుపై 2021లో జరిగిన దాడి కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పలువురు వైసిపి అగ్రనేతలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు గురువారం విచారణ చేయనుంది. వైసిపి ప్రభుత్వంలో సలహాదారుగా చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తాజాగా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఇప్పటికే ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, వైసిపి నేత దేవినేని అవినాష్ దాఖలు చేసిన పిటిషన్లతో కలిపి సజ్జల, ఆళ్ల పిటిషన్లను గురువారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ విఆర్ కృపాసాగర్ వెల్లడించారు. అప్పిరెడ్డి, రఘురామ్, అవినాష్ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగానే వాళ్ల తరపున సీనియర్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కల్పించుకుని, సజ్జల, ఆళ్ల పిటిషన్లను కూడా జత చేసి విచారణ జరపాలని కోరారు. అందుకు అనుమతించిన హైకోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రామస్వామి

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయనున్నట్టు విశాఖ వస్తున్న కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1245వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి తదితరులు మాట్లాడారు. వర్కింగ్ క్యాపిటల్‌కు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని, పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి తీసేందుకు రా మెటీరియల్స్ సమకూర్చాలని, వడ్డీపై రెండేళ్ల మారటోరియం విధించాలని, నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఎనిమిది వేల మంది నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందజేయాలని, కేంద్రం ఆంక్షలతో కోల్పోయిన ఉద్యోగులు, అధికారుల ఆర్థిక ప్రయోజనాలు, ప్రమోషన్లపై సానుకూల నిర్ణయం ప్రకటించాలని, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కంపెనీ భూములు, ఆస్తుల అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కారణంగానే విశాఖ ఉక్కు నష్టాల్లోకి వెళ్లిపోయిందని తెలిపారు. దీక్షల్లో రైతు కూలీ సంఘం నేత రామారావు, దాసరి శ్రీనివాస్, కామేశ్వరరావు, కోటేశ్వరావు, వెంకటరావు, కె.మధుసూదనరావు, కె.అప్పారావు, జి.వేణుగోపాలరావు, సుబ్బయ్య, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: 11వ అంతస్తు, టవర్-ఎ, పెనిసులా బిజినెస్ పార్క్, గణపత్రావ్ కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013.
బ్రాంచి ఆఫీసు: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.: 54-15-4సి/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008.

స్థిరాస్తి అమ్మకం కొరకు ప్రకటన

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువబడే రూల్ 8(6) క్రింద)

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)& రూల్ 9(1)తో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు/లేదా సహ-రుణగ్రహీత, లేదా ప్రత్యేచించి వారి చట్టబద్ధ/ప్రతినిధులు (రుణగ్రహీతలు)కు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్ఎల్)**కు తాకట్టుపెట్టబడినవి. వాటిని టిసిహెచ్‌ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారిచేత స్వాధీనంచేసుకోబడినవి. దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల నుండి బకాయి మొత్తాలను రికవరీచేయుట కొరకు **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" మరియు "రీకోర్స్ లేకుండా"** ప్రాతిపదికన **29.07.2024న విక్రయించబడుతుంది.** రిజర్వు ధర మరియు ధరావత్తు దిగువ పేర్కొనబడినవి. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, అమ్మకం యొక్క ఏదేని వాయిదా/ అమ్మకం కొనసాగింపలేకపోవుట యొక్క గైర్హాజరులో, సదరు సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి **సదరు 29.07.2024న మ॥ 2.00గం.లకు ఇ-వేలం** ద్వారా విక్రయించబడుతుంది. **ఇ-వేలంలో పాల్గొనుట కొరకు ధరావత్తు యొక్క డిమాండ్ డ్రాఫ్టు కలిగియున్న సీల్డు ఎన్వలప్‌ను 27.07.2024న లేదా ముందుగా సా॥ 5.00గం.లలోగా** బ్రాంచి చిరునామా: **'టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.54-15-4సి/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద టిసిహెచ్‌ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారికి దాఖలుచేయవలెను.** సెక్యూర్డ్ అసెట్/ స్థిరాస్తి యొక్క అమ్మకం అనునది ఇందు క్రింద వివరించిన సంక్షిప్త వివరాల ప్రకారం "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే షరతు"పై విక్రయించబడుతుంది.

క్ర సం.	రుణ ఖాతా నం. మరియు బ్రాంచి	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతలు/ చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు/ హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తాలు	రిజర్వు ధర	ధరావత్తు	స్వాధీనతా విధానం
3.	10514991 & 10687761	శ్రీ పదాల గోపి, శ్రీమతి పదాల అనురాధ, వర్ధాన్ కిరాణ	అగ్రిమెంట్ నం.10687761 పరిధిలో మీచేత చెల్లించాల్సిన మరియు బకాయి రూ.2,06,518/- మరియు అగ్రిమెంట్ నం.10514991 క్రింద మీచేత చెల్లించాల్సిన మరియు బకాయి మొత్తాలు రూ.13,95,487/- పూర్తి మొత్తాలు రూ.16,02,005/- & 31.01.2022.	రూ. 9,95,000/- (రూపాయలు తొమ్మిది లక్షల తొంబై ఐదు వేలు మాత్రమే)	రూ. 99,500/- (రూపాయలు తొంబై తొమ్మిది వేల ఐదు వందలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: ఐటెం-1: కృష్ణా జిల్లా, నున్నా సబ్-రిజిస్ట్రార్, విజయవాడ రూరల్ మండలం, నున్నా గ్రామపంచాయతి & గ్రామం, ఆర్.ఎస్.నం.758/2, సైటు విస్తీర్ణం 2200చ.గ.లు యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** బి. భాస్కర్ రెడ్డి ఆస్తి& రోడ్డు, **దక్షిణం:** జెట్టి సాయి బాబా ఆస్తి, **పడమర:** సిహెచ్ వేంకటేశ్వర రావు ఆస్తి, **ఉత్తరం:** వై. వెంకట్ రెడ్డి & ఇతరుల ఆస్తి. ఈ సరిహద్దుల మధ్య జాయింట్ సైటు యొక్క 25చ.గ.లు లేదా 20.90చ.మీ.ల విస్తీర్ణంతో విడదీయలేని భాగంనకుగాను 1200చ.గ.లు లేదా 1003.32చ.మీ.లలో నిర్మించబడిన బ్లాక్ నం.1లో 2200చ.గ.లు లేదా 1839.48 చ.మీ.ల నివాస సైటు. **ఐటెం-2:** అసెస్మెంట్ నం.3327, డోర్ నం.14-175/4జి గా "మహేశ్వరి టవర్స్", పేరు& స్టైల్‌లో బ్లాక్ నం.1, 3వ అంతస్తు ఫ్లాట్ నం. టిఎఫ్-జి లో నిర్మించిన పై పేర్కొన్న ఐటెం నం.1 ఆస్తి అపార్టుమెంట్స్. సరిహద్దులు: **తూర్పు:** ఓపెన్ టు స్కై, మెట్లు & ఉమ్మడి కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఫ్లాట్ నం.టిఎఫ్-హెచ్, **ఉత్తరం:** ఉమ్మడి కారిడార్. దానికి సంబంధించిన ఈజిమెంట్స్ హక్కులన్నింటితో ఉమ్మడి ఏరియాలు& సదుపాయాలలో ఉమ్మడి హక్కులతోపాటు, అన్ని వసతులు, ఫిక్చర్స్, ఫిటింగ్స్‌తో 680చ.అ.ల ప్లింత్ ఏరియా, 20చ.అ.ల ఉమ్మడి ఏరియా, 100చ.అ. కార్ పార్కింగ్‌తో 3వ అంతస్తులోని ఫ్లాట్ నం.టిఎఫ్-జి						
5.	10556840	శ్రీ బండి శ్రీనివాస్ శ్రీమతి బండి సాయి లక్ష్మి	రూ.9,41,379/- (రూపాయలు తొమ్మిది లక్షల నలభై ఒక వేల మూడు వందల డెబ్బై తొమ్మిది మాత్రమే)	రూ. 4,60,000/- (రూపాయలు నాలుగు లక్షల అరవై వేలు మాత్రమే)	రూ. 46,000/- (రూపాయలు నలభై ఆరు వేలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: నందిగామ ఎస్ఆర్ఒ, చందర్లపాడు మండలం, ముప్పల గ్రామపంచాయతి ఏరియా, ముప్పల గ్రామంలో ఆర్‌సి నం.225/4, 225/5, ఎపిసిఆర్‌డిఎ ఎల్.పి. నం.28/2016, వద్ద రిజిస్టర్డు సేల్ డీడ్ నం.1991/2019 ఆధారంగా, శ్రీ బండి శ్రీనివాస్ పేరున ఫ్లాట్ నం.27లో 150చ.గ.ల విస్తీర్ణం యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: **తూర్పు:** 40-00అ.లు వెడల్పు రోడ్డు 30-0అ.లు, **దక్షిణం:** ఫ్లాట్ నం.26 సరిహద్దు, 45-0'అ.లు, **పడమర:** ఇతరుల ల్యాండ్ 30-0అ.లు, **ఉత్తరం:** ఫ్లాట్ నం.28 సరిహద్దు 45-0అ.లు ఈ సరిహద్దుల్లో అన్ని ఈజిమెంట్ హక్కులతో 150-0చ.గ.లు లేదా 125-419చ.మీ.ల విస్తీర్ణపు ఓపెన్ ల్యాండ్.						
6.	10605834	శ్రీ చిగురుపాటి శ్రీనివాస రావు, శ్రీమతి చిగురుపాటి శ్రీ భాగ్యలక్ష్మి	Rs. 10,18,623/- ---------------- 12-08-2023	రూ.6,90,000/- (రూపాయలు ఆరు లక్షల తొంబై వేలు మాత్రమే)	రూ. 69,000/- (రూపాయలు అరవై నాలుగు వేలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.3356/2019 ఆధారంగా శ్రీ సి. శ్రీనివాస రావు పేరున ఉన్న నందిగామ ఎస్ఆర్ఓ, ముప్పల గ్రామ పంచాయతి ఏరియా, ముప్పల గ్రామం, చందర్లపాడు మండలం, ఆం.ప్ర. వద్ద ఆర్.ఎస్.నం.225/4, 225/5, ఎల్.పి.నం.28/2016, విస్తీర్ణం 150చ.గ.ల ఫ్లాట్ నం.23 యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** 40-00అ.లు వెడల్పు రోడ్డు, **పడమర:** రావూరి విశ్వనాథం & ఇతరుల ల్యాండ్ 30-0అ.లు, **ఉత్తరం:** ఫ్లాట్ నం. 24 సరిహద్దు 45-0అ.లు, **దక్షిణం:** ఫ్లాట్ నం.22 సరిహద్దు, 45-0అ.లు.						
7.	TCHHL08 03000100 084395	శ్రీ మోడెంటి దుర్గా ప్రసాద్ & శ్రీమతి మొండేటి రూపవతి	రూ.29,16,115/- (రూపాయలు ఇరువై తొమ్మిది లక్షల పదహారు వేల నూటా పదిహేను మాత్రమే) & 15.11.2022	రూ.22,25,000/- (రూపాయలు ఇరువై రెండు లక్షల ఇరువై ఐదు వేలు మాత్రమే)	రూ. 2,22,500/- (రూపాయలు రెండు లక్షల ఇరువై రెండు వేల ఐదు వందలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.2029/2017 ఆధారంగా శ్రీ మొండేటి దుర్గా ప్రసాద్ పేరున ఉన్న అంబాపురం గ్రామం, అంబాపురం గ్రామపంచాయతి ఏరియా, విజయవాడ రూరల్ మండలం, నున్నా సబ్-రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల ఆర్ఎస్ నం.99/4 & 99/5ఎ, ఆర్.ఎల్.పి.నం.361/2010/ విజిఎ, ఫ్లాట్ నం.61, డోర్ నం.1-9 సమీపంలో పూర్తి విస్తీర్ణం 206.0చ.గ.లకుగాను 36.0చ.గ.ల ఉమ్మడి విస్తీర్ణంతోపాటు 800.0చ.అ.ల నిర్మాణ ఏరియాతో "లక్ష్మి శ్రీనివాస టవర్స్" యొక్క రెండవ అంతస్తులో తూర్పు వైపు ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-2 యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: **తూర్పు:** ఇతరులకు డి. రాజాగోపాల రాజుచేత విక్రయించబడిన ఆస్తి-34.0అ.లు, **దక్షిణం:** పి. వర ప్రసాదమ్మ యొక్క 54.0అ.ల ఫ్లాట్ నం.60, **పడమర:** 33.0అ.ల వెడల్పు రోడ్డు, 34.0అ.లు, **ఉత్తరం:** పి. నరేంద్ర బాబు యొక్క 54.6అ.ల ఫ్లాట్ నం.62. **ఫ్లాట్‌కు సరిహద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్& మెట్లు, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.						
8.	10229198	శ్రీ కొలంగి యేదుకొండలు (రుణగ్రహీత) శ్రీమతి కొలంగి వీరరాగమ్మ (సహ-రుణగ్రహీత)	Rs.12,70,441/- & 16.11.2021	రూ.5,45,000/- (రూపాయలు ఐదు లక్షల నలభై ఐదు వేలు మాత్రమే)	రూ. 54,500/- (రూపాయలు యాభై నాలుగు వేల ఐదు వందలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట సబ్-రిజిస్ట్రార్, సుబ్బయ్య గూడెం గ్రామపంచాయతి & గ్రామం, వద్దగల ఆర్.ఎస్.నం.35/2ఎ1ఎ, 35/2ఎ1బి, 35/2సి1, ఎపిసిఆర్‌డిఎ విజయవాడ వారిచే ఆమోదించబడిన లేఔట్ ఎల్.పి.నం.53/2016, లేఔట్ ప్లాన్ ఫ్లాట్ నం.207, విస్తీర్ణం 248.75చ.గ.లు. సరిహద్దులు: **తూర్పు:** ఫ్లాట్ నం. 208, **దక్షిణం:** ఫ్లాట్ నం.206, **పడమర:** 40-0అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ఇతరుల ఆస్తి. పై సరిహద్దుల్లో 248.75చ.గ.లు లేదా 207.97చ.మీ.ల విస్తీర్ణంల ఈజిమెంట్స్& దాని అనుబంధం హక్కులతోపాటు ఖాళీ సైటు.						
9.	10124413	శ్రీ ఎస్. కోటేశ్వర రావు, శ్రీమతి ఎస్. పుష్పలత	రూ.20,72,293/- (రూపాయలు ఇరువై లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంబై మూడు మాత్రమే) & 12.10.2022	రూ. 17,00,000/- (రూపాయలు పదిహేడు లక్షలు మాత్రమే)	రూ.1,70,000/- (రూపాయలు ఒక లక్ష డెబ్బై వేలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.12939/2017 ఆధారంగా శ్రీ సంకబత్తుల కోటేశ్వర రావు పేరున ఉన్న కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట ఎస్ఆర్ఓ పరిధిల్లో వాత్సవయి మండలం, భీమవరం గ్రామం & గ్రామపంచాయతి లోగల టిఎల్‌పి నం.141/2015/ఆర్, రెఫరెన్స్ ఆర్.సి.నం.సిఎఫ్‌జి 5-10/2013 తేది: 02.04.2015 క్రింద ఆమోదిత డి.టి.సి.పి. లేఔట్ నం.3217/138/2015/ఆర్3 ప్రకారం ఆర్.ఎస్.నం.లు 327/1బి,2,3, 328/1(పి), 2ఎ1, 2ఎ2, 2బి మరియు 330/2ఎ(పి) & 327/2, ఫ్లాట్ నం.115 లో ఎక.2.00సెంట్లు యొక్క 516 చ.గ.ల విస్తీర్ణంతో భాగం మొత్తం. **సరిహద్దులు: తూర్పు:** 33-0అ.ల వెడల్పు రోడ్డు 99-0అ.లు, **పడమర:** ఫ్లాట్ నం.లు 138, 137, 136లో 99-0అ.లలో ఆస్తి., **ఉత్తరం:** ఫ్లాట్ నం.128 లో ఆస్తి 47-0అ.లు, **దక్షిణం:** ఫ్లాట్ నం.124లో ఆస్తి 47-0అ.లు.						
10	10134363	శ్రీమతి నల్లాని చక్రవర్తులు సౌజన్య, శ్రీ రాజమణికంఠం కె.	రూ.25,99,363/- (రూపాయలు ఇరువై ఐదు లక్షల తొంబై తొమ్మిది వేల మూడు వందల అరవై మూడు మాత్రమే) & 14.04.2022	రూ. 14,00,000/- (రూపాయలు పద్నాలుగు లక్షలు మాత్రమే)	రూ. 1,40,000/- (రూపాయలు ఒక లక్ష నలభై వేలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: షెడ్యూలు-ఎ: కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-డిస్ట్రిక్ట్, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతి, ఆర్.ఎస్.నం.119/2, ఫ్లాట్ నం.4, సైటు విస్తీర్ణం 246.8చ.గ.లు. సరిహద్దులు: **తూర్పు:** 33'అ.ల వెడల్పు రోడ్డు-40.4అ.లు, **దక్షిణం:** రామకృష్ణ నగర్-55.0అ.లు, **పడమర:** ఎం వి రమణకు చెందిన ఫ్లాట్ నం.3, 40.4అ.లు, **ఉత్తరం:** జిఆర్ సుబ్రమణ్యంకు చెందిన ఫ్లాట్ నం.5, 55.0అ.లు, **ఈ సరిహద్దుల మధ్య 246.8చ.గ.లు లేదా 206.35చ.మీ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను 49.2చ.గ.లు లేదా 41.1చ.మీ.ల సూచించజాలని ఉమ్మడి భాగం.** **షెడ్యూలు-బి:** పై పేర్కొన్న పూర్తి షెడ్యూలు-ఎలో రెండవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-1లో "బాలాజీ టవర్స్" పేరు& స్టైల్‌లో నిర్మించిన అపార్టుమెంట్ ఆస్తి. సరిహద్దులు: **తూర్పు:** ఈ ఫ్లాట్ మరియు ఎస్ఎఫ్-2 మధ్య ఉమ్మడి గోడ, **దక్షిణం:** ఓపెన్ టు స్కై& ఉమ్మడి కారిడార్, **పడమర:** బాల్కనీ, ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఉమ్మడి కారిడార్, మెట్లు, 875చ.అ.ల విస్తీర్ణంతో ప్లింత్ ఏరియా తో ఎస్ఎఫ్-1 పై సరిహద్దుల మధ్య, 150చ.అ.ల ఉమ్మడి ఏరియాలు, 20చ.అ.ల పార్కింగ్, దానికి సంబంధించిన ఈజిమెంట్స్ హక్కులన్నింటితోపాటు, మెట్లు వంటి ఉమ్మడి సదుపాయాలతోసహా వసతులు, ఫిక్చర్స్, ఫిటింగ్స్ వంటి అన్నింటితో.						
11.	10421835	శ్రీ వరద కోటేశ్వర రావు, శ్రీమతి వరద లోక కళ్యాణి	రూ.9,83,782/- (రూపాయలు తొమ్మిది లక్షల ఎనభై మూడు వేల ఏడు వందల ఎనభై రెండు మాత్రమే) & 15.11.2022.	రూ. 6,85,000/- (రూపాయలు ఆరు లక్షల యాభై ఐదు వేలు మాత్రమే)	రూ. 68,500/- (రూపాయలు అరవై ఎనిమిది వేల ఐదు వందలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.5689/2018 ఆధారంగా శ్రీ వరద కోటేశ్వర రావు పేరున ఉన్న కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట ఎస్ఆర్ఒ, జగ్గయ్యపేట మండలం, షేర్ ఎండి పేట్, రవికంపాడు శివారు లో ఎల్.పి.నం.49/2016/విజిఎ, ఫ్లాట్ నం.31, "సిద్ధార్థ టౌన్‌షిప్" సర్వే నం.56 లో ఎక.11.50సెంట్ల విస్తీర్ణపు సైటు యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** 40అ.ల వెడల్పు రోడ్డు-36అ.లు, **దక్షిణం:** ఫ్లాట్ నం.30లో ల్యాండ్-50అ.లు, **పడమర:** ఫ్లాట్ నం.55లో ల్యాండ్-36అ.లు, **ఉత్తరం:** ఫ్లాట్ నం.32లో ల్యాండ్-50అ.లు. ఈ సరిహద్దుల్లో 200చ.గ.ల విస్తీర్ణపు ఓపెన్ ఫ్లాట్.						

[illegible]

గమనిక: ఉత్సుక ఇ-వేలం పోర్టల్ http://bankauctions.in/ ద్వారా 29.07.2024న మ॥ 2.00గం.ల నుండి మ॥ 3.00గం.ల మధ్య [illegible]

[illegible] info@bankauctions.in [illegible] Bansal@tatacapital.com [illegible] arijit@bankauctions.in [illegible] http://surl.li/huhehw [illegible] https://www.tatacapital.com/property-disposal.html [illegible]

ప్రదేశం: విజయవాడ
తేది: 11.07.2024

సం/- అధీకృత అధికారి,
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి (01451) : డి.నెం. 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు /హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట** బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 14-08-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : శ్రీమతి రావి సబిత (ఋణగ్రహీత), భర్త : రావి అంజయ్య, రామాలయం దగ్గర, డి.నెం. 23-146, గంగానమ్మ గుడి వీధి, పశ్చి ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్- 521456. **శ్రీ రావి ధీరజ్ కుమార్,** తండ్రి : అంజయ్య రావి, రామాలయం దగ్గర, డి.నెం. 23-146, గంగానమ్మ గుడి వీధి, పశ్చిమ ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్- 521456.

బకాయి మొత్తం : ది. 08-07-2024 నాటికి రూ. 36,64,063.06/- (అక్షరాలా ముప్పై ఆరు లక్షల అరవై నాలుగు వేల అరవై మూడు రూపాయల ఆరు పైసలు మాత్రమే) మరియు ఒప్పందం చేసుకున్నరేటు ప్రకారం ది. 01-01-2024 నుండి తదుపరి వడ్డీమరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 1158/2002, తేది : 03-04-2002. ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, పశ్చిమ ఇబ్రహీంపట్నం, గంగానమ్మ గుడి, రామాలయం దగ్గర, ఆర్.ఎస్.నెం. 89, అసిస్‌మెంట్ నెం. 3694, డి.నెం. 23-146 వద్ద 697 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస ఇల్లు. **హద్దులు : తూర్పు :** రామినేని తిరుపతమ్మ గారి ఆస్తి, **దక్షిణం :** బజారు, **పడమర :** మురళీకృష్ణప్రసాద్ గారి ఆస్తి, **ఉత్తరం :** కోగంటి నరసింహారావు & ఇతరుల ఆస్తి.

రిజర్వు ధర : రూ. 1,32,07,000/- ధరావత్తు : రూ. 13,20,700/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://ebkray.in** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ శ్రీమతి టి. శ్రీలక్ష్మి గారి మొబైల్ నెం. 73061 42248 (M)** బ్రాంచి **Mail ID : ubin0801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

చట్టబద్ధమైన ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 08-07-2024
ప్రదేశం : విజయవాడ

సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి (01451) : డి.నెం. 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు /హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట** బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 14-08-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : శ్రీ కర్లపాలెం రవి కిరణ్ (ఋణగ్రహీత), తండ్రి : రామకృష్ణ, డి.నెం. 1-2-107-31, మారుతీనగర్, కొత్తపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 500036.

బకాయి మొత్తం : రూ. 15,47,897.36/- (అక్షరాలా పదిహేను లక్షల నలభై ఏడు వేల ఎనిమిది వందల తొంభై ఏడు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) మరియు ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 2879/2013, తేది : 07-11-2013. శ్రీ కర్లపాలెం రవికిరణ్ గారి పేరిట ఆంధ్రప్రదేశ్, విజయవాడ, నున్న, పవర్ గ్రిడ్ దగ్గర, గుణదల రోడ్డు, ఆర్.ఎస్.నెం. 722/2ఎ వద్ద మహేశ్వరి హైట్స్ అపార్ట్‌మెంట్ నందు రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 302కి చెందిన నివాస ఫ్లాట్. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 301, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము. **ఆస్తికి హద్దులు : తూర్పు :** డొంక, **దక్షిణం :** గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కెనాల్, **పడమర :** అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సీతారావమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** బడిశ దుర్గ గారి ఆస్తి.

రిజర్వు ధర : రూ. 20,34,000/- ధరావత్తు : రూ. 2,03,400/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://ebkray.in** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ శ్రీమతి టి. శ్రీలక్ష్మి గారి మొబైల్ నెం. 73061 42248 (M)** బ్రాంచి **Mail ID : ubin0801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

చట్టబద్ధమైన ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 09-07-2024
ప్రదేశం : విజయవాడ

సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి (01451) : డి.నెం. 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు /హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట** బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 14-08-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీమతి వేములపూడి దీక్షిత కృష్ణ, భర్త : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010. **2) వేములపూడి హోషిత,** తండ్రి : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010. **3) వేములపూడి జోషిత్,** తండ్రి : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010.

బకాయి మొత్తం : ది. 05-07-2024 నాటికి రూ. 19,95,250.21/- (అక్షరాలా పంథొమ్మిది లక్షల తొంభై ఐదు వేల రెండు వందల యాభై రూపాయల ఇరవై ఒక్క పైసా మాత్రమే) మరియు ది. 31-01-2020 న ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : శ్రీ వేములపూడి ప్రేమ్ కుమార్, తండ్రి : వి. రమణ గారి పేరిట విజయవాడ - 520010, పటమట, మున్సిపల్ వార్డు నెం. 32/3, 27ఎ, రామాలయం వీధి, అసిస్ట్ నెం. 262017, ఆర్.ఎస్.నెం. 81 (పాత డోర్ నెం. 68-6-5) డి.నెం. 68-6-5/1 వద్ద మొత్తం విస్తీర్ణం 36 + 55.43 = 91.43 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస భవనము దానికి చెందిన గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్స్.

షెడ్యూల్ -ఎ : డాక్యుమెంట్ నెం. 3829/2015, తేది : 16-06-2015 : ఆస్తికి హద్దులు : తూర్పు : తాడిశెట్టి కోటయ్య గారి ఆస్తి, **దక్షిణం :** రామ కోటేశ్వరరావు గారి ఆస్తి, **పడమర :** వేములపూడి ప్రేమ్ కుమార్ గారి ఆస్తి **ఉత్తరం :** వడ్డి చలపతిరావు గారి ఆస్తి విస్తీర్ణం : 55.43 చ॥గ॥లు

షెడ్యూల్ -బి : డాక్యుమెంట్ నెం. 7967/2013 (కాపీ), తేది : 09-12-2013 : ఆస్తికి హద్దులు : తూర్పు : వడ్డి శంకరశర్మ గారి ఆస్తి, **పడమర :** ప్రతివాడ శ్రీనివాసరావు గారి ఆస్తి & 3 అ॥ వెడల్పు జాయింట్ దారి, **ఉత్తరం :** 3 అ॥ వెడల్పు జాయింట్ దారి, **దక్షిణం :** పటమట రామకోటేశ్వరరావు గారి ఆస్తి. విస్తీర్ణం : 36 చ॥గ॥లు. **మొత్తం విస్తీర్ణం : 36 + 55.43 = 91.43 చ॥గ॥లు**

రిజర్వు ధర : రూ. 38,80,000/- ధరావత్తు : రూ. 3,88,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://ebkray.in** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ శ్రీమతి టి. శ్రీలక్ష్మి గారి మొబైల్ నెం. 73061 42248 (M)** బ్రాంచి **Mail ID : ubin0801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

చట్టబద్ధమైన ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 10-07-2024
ప్రదేశం : విజయవాడ

సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఉత్పత్తి రంగం కుదేల్

- 54 లక్షల ఉద్యోగాలు హాంఫట్
- పెరగని ఉత్పాదకత
- ఒడిదుడుకులకు కారణమైన పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, కోవిడ్
- ఆర్‌బిఐ క్లెమ్స్ డాటాబేస్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశీయ ఉత్పత్తి రంగం తిరోగనమంలో ఉంది. ఉద్యోగ కల్పనలో బాగా వెనుకబడి పోయింది. చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థల్లోనే కాకుండా అనధికారికంగా నడుస్తున్న సంస్థల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, విధింపు, కోవిడ్ మహమ్మారి వంటి అంశాలే దీనికి కారణాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా అనధికారిక రంగంలో ఉద్యోగ కల్పన బాగా తక్కువగా ఉంటోంది. చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థల్లో సైతం 2015-16, 2022-23 మధ్యకాలంలో కేవలం 86 లక్షల ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. అంటే ఈ మధ్యకాలంలో ఉద్యోగాల సంఖ్య కేవలం 7 శాతం మాత్రమే పెరిగింది. సగటున ఏటా పది లక్షల మందికి మాత్రమే ఉపాధి లభించింది. ఈ రంగంలో ఉద్యోగాల కల్పన తక్కువగా ఉండడంతో పాటు కొత్తగా వచ్చిన ఆ ఉద్యోగాలు సైతం ఉత్పాదకతను పెంచలేకపోయాయి. తాజాగా విడుదలైన రిజర్వ్‌బ్యాంక్ సమాచారం ప్రకారం 2015-16, 2022-23 మధ్యకాలంలో పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కారణంగా ఉత్పత్తి రంగంలో 54 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ గత వారం విడుదల చేసిన వార్షిక సర్వే నివేదికను ఆధారంగా చేసుకొని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా) సంస్థ అనధికారిక రంగంలో నెలకొన్న పరిస్థితులను విశ్లేషించింది.

ఇటీవలి సంవత్సరాల్లో సంభవించిన ఆర్థిక ఒడిదుడుకులు అనధికారిక రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని ఇండ్-రా తెలిపింది. ఈ ఒడిదుడుకులు 2022-23 జీడీపీలో 4.3 శాతం మేర ప్రభావం చూపాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్-19 వంటి పరిణామాలు అనధికారిక రంగంలో ఉద్యోగ కల్పన అవకాశాలను దారుణంగా దెబ్బతీశాయి.

ఆర్‌బీఐకి చెందిన క్లెమ్స్ (క్యాపిటల్, లేబర్, ఎనర్జీ, మెటీరియల్, పర్చేజ్ సర్వీసెస్) డాటాబేస్ దేశ ఆర్థిక రంగంలోని 27 కీలక రంగాల సమాచారాన్ని విశ్లేషించింది. అందుకోసం వివిధ వనరుల నుంచి సేకరించిన ప్రభుత్వ సమాచారాన్ని వినియోగించింది. దీని ప్రకారం...2015-16, 2022-23 మధ్యకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్తగా 12.5 కోట్ల ఉద్యోగాలు చేరాయి. వీటిలో 86 లక్షలు అంటే 6.9 శాతం ఉద్యోగాలు ఉత్పత్తి రంగంలోనివే. సేవల రంగంలో 4.9 కోట్ల ఉద్యోగాలు వచ్చాయి.

ఉత్పాదకత పెరగలేదు

2022-23 నాటికి వ్యవసాయేతర అనధికారిక రంగంలో సుమారు 10.96 కోట్ల మంది పనిచేస్తున్నారని ఇండ్-రా తెలిపింది. ఈ సంఖ్య 2015-16తో పోలిస్తే 11.13 కోట్లు తక్కువ. ఉత్పత్తి రంగం ఉద్యోగాలు కోల్పోవడమే దీనికి ప్రధాన కారణం. 2022-23లో ఉత్పత్తి రంగంలో 3.6 కోట్ల మంది పనిచేశారు. ఈ సంఖ్య 2015-16తో పోలిస్తే 54 లక్షలు తక్కువ. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 2015-16లో ఉత్పాదకత ఎలా ఉన్నదో 2022-23లో కూడా అలాగే ఉంది. అంటే కొద్దో గొప్పో ఉద్యోగ నియామకాలు జరిగినప్పటికీ ఉత్పాదకత మాత్రం పెరగలేదు.

ఉత్పత్తి రంగంలో ప్రతి కార్మికుడి ఉత్పాదకతను కొలిచే 'స్థూల వాల్యూ ఎడిషన్' 2022-23లో రూ.3.96 లక్షలుగా ఉంది. ఇది 2015-16లో కంటే (3.49 లక్షలు) స్వల్పంగా మాత్రమే పెరిగింది. కోవిడ్ కారణంగా సమస్యలు ఎదురైనప్పటికీ ఉత్పత్తి రంగం అనేక నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుంది. అయితే ఉత్పాదకత విషయంలో చైనా వంటి దేశాలకు చాలా దూరంలో ఉండిపోయింది.

వాణిజ్యం, ఇతర సేవలు సహా అనధికారిక రంగాన్ని ఇండ్-రా విశ్లేషణ పరిశీలించింది. 2015-16, 2022-23 మధ్యకాలంలో తగిలిన ఎదురు దెబ్బలు కేవలం ఉత్పత్తి రంగానికి మాత్రమే పరిమితం కాలేదని తేల్చింది. 2022-23లో దేశంలో 6.5 కోట్ల అనధికారిక సంస్థలు ఉన్నాయి. 2015-16తో పోలిస్తే ఇది కేవలం 20 లక్షలు మాత్రమే అధికం. దీనికి భిన్నంగా 2010-11, 2015-16 మధ్యకాలంలో 57 లక్షల అనధికారిక సంస్థలు ఆవిర్భవించాయి. ఎదురు దెబ్బలు తగకుండా ఉంటే 2022-23 నాటికి దేశంలో అనధికారిక సంస్థల సంఖ్య 71.4 మిలియన్లకు చేరి ఉండేదని అంచనా. అదే విధంగా ఉద్యోగుల సంఖ్య కూడా 125.3 మిలియన్లకు చేరి ఉండేది. మరో మాటలో చెప్పాలంటే 2015-16, 2022-23 మధ్యకాలంలో అనధికారిక రంగం 6.3 మిలియన్ సంస్థలను, 16 మిలియన్ల ఉద్యోగాలను కోల్పోయింది. 2022-23లో దేశంలో అనధికారిక సంస్థల ఆర్థిక పరిమాణం రూ.15.4 లక్షల కోట్లుగా ఉంది. అయితే 2010-11, 2015-16తో పోలిస్తే వృద్ధి చాలా తక్కువగా ఉంది.

కతువాలో ఉగ్రదాడిని ఖండించిన సిపిఎం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కతువా జిల్లాలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో ఐదుగురు జవాన్లు మరణించగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పదేపదే జరుగుతున్న ఇలాంటి సంఘటనలు జమ్ముకాశ్మీర్‌లో సాధారణ, శాంతి భద్రతల పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ ప్రాంతంలో ఇలాంటి విచారకరమైన సంఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయో పరిపాలన ఆత్మపరిశీలన చేసుకోవాలి. 2019 ఆగస్ట్ 5 నుండి జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితి గొప్పగా ఉందనే ప్రచారం సరిపోవడం లేదు. ఇటీవలి కాలంలో కూడా ఈ ప్రాంతంలో అనేక ఉగ్రదాడులు జరిగాయి. అయితే ఈ ప్రాంతంలోని విభిన్న విశ్వసనీయ స్వరాలతో చర్చలు జరపడానికి బదులుగా పాలనా యంత్రాంగం నిద్రమత్తులో చిక్కుకున్నట్లు కనిపిస్తోంది. . ఇలాంటి గొంతుకలపై పాలనా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. హేయమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలనుకుంటే, పరిపాలన ప్రజలకు చేరుకోవాలి, ప్రజల మాటలను వినాలి. తద్వారా ఉగ్రవాద కార్యాక్రమాలను నిర్మూలించడానికి ప్రజల మద్దతు ఉపయోగించబడుతుంది' అని ప్రకటనలో తెలిపింది. అలాగే, 'ప్రజల హక్కులను రక్షిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంపొందించకపోతే శాంతిని పునరుద్ధరించలేము. ఈ ప్రక్రియ ద్వారానే భద్రతా సంస్థల చర్యలతో పాటు టెర్రరిజంపై పోరాడవచ్చు' అని సిపిఎం జమ్ముకాశ్మీర్ రాష్ట్ర కమిటీ తెలిపింది.



సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు !

- ఆస్ట్రియా చాన్సలర్‌తో మోడీ భేటీ
- ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలపై సుదీర్ఘంగా చర్చ

వియన్నా : భారత్, ఆస్ట్రియాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు గల కొత్త అవకాశాలను గుర్తించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. రాబోయే దశాబ్ద కాలంలో సహకారానికి బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సంబంధాలకు వ్యూహాత్మక దిశా నిర్దేశాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోడీ, ఆస్ట్రియా ఛాన్సలర్ కర్ల్ నెహమర్‌తో చర్చలు జరిపారు. అనంతరం నెహమర్‌తో కలిసి మోడీ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తమ చర్చలు అర్థవంతంగా సాగాయని మోడీ చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం, పశ్చిమాసియాలో పరిస్థితులతో సహా ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న వివాదాలన్నింటిపై సవివరంగా చర్చించినట్లు చెప్పారు. యుద్ధానికి ఇది సమయం కాదని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. సమస్యలకు పరిష్కారాలు యుద్ధ రంగంలో లభించవన్నారు. చర్చలు, దౌత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని నొక్కి చెప్పారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా ఆమోదయోగ్యం కాదని, ఏ రకంగానూ దాన్ని సమర్థించలేమని మోడీ పేర్కొన్నారు. గత 40ఏళ్ళలో భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రక్రియకు సంబంధించి చూసినట్లైతే భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కావాలంటే తటస్థ దేశంగా తమ దేశంలో చర్చలు జరుపుకోవచ్చని నెహమార్ పేర్కొన్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై కూలంకషంగా చర్చించామని చెప్పారు. ఈ యుద్ధంపై యురోపియన్ దేశాల ఆందోళనలు, ఇబ్బందులను భారత్‌కు తెలియచేసినట్లు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో ఘర్షణలపై కూడా సుదీర్ఘంగా చర్చించామన్నారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అందువల్ల శాంతి ప్రక్రియలు, భవిష్యత్ శాంతి సదస్సులకు సంబంధించి భారత్‌ది చాలా కీలకమైన పాత్ర అని నెహమర్ చెప్పారు.

రష్యాతో బంధంపై ఆందోళనలు వున్నా భారత్ వ్యూహాత్మక భాగస్వామే

- అమెరికా స్పష్టీకరణ

వాషింగ్టన్ : రష్యాతో గల బంధంపై అమెరికాకు ఆందోళనలు వున్నప్పటికీ భారత్ వ్యూహాత్మక భాగస్వామిగానే కొనసాగుతుందని బైడెన్ ప్రభుత్వం ప్రకటించింది. ఉక్రెయిన్‌లో యుద్ధం చెలరేగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ రష్యాలో రెండు రోజుల పర్యటనను అమెరికా నిశితంగా పరిశీలించింది. బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు ఫలించవని, యుద్ధ రంగంలో ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం లభించదని మంగళవారం మోడీ, పుతిన్‌కు స్పష్టం చేశారు. రష్యాతో భారత్ సంబంధాలపై అడిగిన ప్రశ్నలకు పెంటగన్ ప్రతినిధి, విదేశాంగ శాఖ ప్రతినిధి వేర్వేరుగా స్పందించారు. 'భారత్, రష్యాల మధ్య దీర్ఘకాలంగా సంబంధాలు వున్నాయి. అమెరికా కోణం నుండి చూసినట్లైతే భారత్ ఎప్పటికీ వ్యూహాత్మక భాగస్వామిగానే వుంటుంది. రష్యాతో భారత్ సంబంధాలతో సహా ప్రతి అంశంపైనా పూర్తి స్థాయిలో, నిష్కపటమైన రీతిలో చర్చలు కొనసాగిస్తాం." అని పెంటగన్ పత్రికా కార్యదర్శి మేజర్ జనరల్ పాట్ రియాదర్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ విలేకర్లతో మాట్లాడుతూ, రష్యాతో భారత్ సంబంధాలపై తమ ఆందోళనల గురించి అమెరికా చాలా స్పష్టంగా వుందన్నారు. వాటిని భారత ప్రభుత్వానికి ప్రైవేటుగా తెలియచేస్తాం. భారత్‌తో సంబంధాల విషయంలో ఎలాంటి మార్పు వుండదని స్పష్టం చేశారు. మోడీ పర్యటనతో తాము ఏకాకులం కాలేదని పుతిన్ ఈ ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రయత్నిస్తున్నారనడంలో ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదని రియాదర్ వ్యాఖ్యానించారు.

ఎ. పద్మనాభన్ మృతికి ఎఐఎడబ్ల్యుయు సంతాపం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ రాష్ట్ర వ్యవసాయ కార్మికుల ఉద్యమ వ్యవస్థాపక నాయకులలో ఒకరైన ఎ. పద్మనాభన్ మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి. వెంకట్ ప్రకటన విడుదల చేశారు. "జనరల్ కౌన్సిల్ ఏర్పడినప్పటి నుండి ఎ. పద్మనాభన్ సభ్యులు. కేంద్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. కేరళలోని కెఎస్ కెటియు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కూడా ఉన్నారు. కనీస వేతనాలు, నిర్ణీత పని గంటలు, కార్మికుల హక్కులు, వరి పొలాల రక్షణ కోసం అనేక ఉద్యమాల్లో అగ్రగామిగా నిలిచారు. ఆయన ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలయ్యారు. భూస్వాములు, పోలీసుల నుండి భౌతిక దాడికి గురయ్యారు" అని ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, తోటి సహచరులకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

యుపిలో ఘోర ప్రమాదం

- 18 మంది మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణిచంగా, 19 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఆగ్రా-లక్నో రహదారిపై డబుల్ డెక్కర్ బస్సు ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బంగార్‌మావు ప్రాంతంలోని జోజికోట్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానిక సర్కిల్ ఆఫీసర్ అరవింద్ కుమార్ తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెప్పారు.

ఉక్రెయిన్‌లో నాటో కార్యాలయం ఏర్పాటు ?

- నిరసనల మధ్య నాటో సదస్సు ప్రారంభం

వాషింగ్టన్ : యుద్ధంతో అతలాకుతల మవుతున్న ఉక్రెయిన్‌కు కొత్తగా సాయం చేయడానికి నాటో దేశాలు సిద్ధమయ్యాయి. ఉక్రెయిన్‌లో నాటో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంపై ఈ సదస్సులో ప్రకటన వెలువడే అవకాశం వుంది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ మంగళవారం అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ విషయం వెల్లడించారు. నాటో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమంటే దానితో పాటు ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని పర్యవేక్షించే నాటో కమాండ్ కూడా ఏర్పడుతుంది. అమెరికా నేతృత్వంలో తాత్కాలికంగా ఏర్పాటైన గ్రూపు పర్యవేక్షణలో ఇప్పటివరకు వున్న ఆయుధాలు, ఇతర రవాణా పర్యవేక్షణ బాధ్యతలను నాటో కూటమికి మార్చడం జరుగుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు వాషింగ్టన్‌లో నిరసనల మధ్య ప్రారంభమైంది.తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉక్రెయిన్ జరిపే యుద్ధం మరింత పెచ్చరిల్లే అవకాశాలు వుంటాయని భావిస్తున్నారు. నాటో సెక్రటరీ జనరల్‌గా పదవీ విరమణ చేస్తున్న జీన్స్ స్టాల్టెన్ బర్గ్ ఒక ప్రకటన చేస్తూ ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం 2034 వరకు లభించకపోవచ్చని అన్నారు. ఎప్పటిలానే తమ నుంచి ఉక్రెయిన్ ఆయుధాలను కొనుగోలు చేయాలన్నది నాటో సభ్యత్వానికి ఒక ముందస్తు షరతు అని ఆయన చెప్పారు.కీవ్‌లో కొత్తగా నాటో సీనియర్ ప్రతినిధిని నియమిస్తారని ఆయన తెలిపారు. నాటో కూటమితో ఉక్రెయిన్ వ్యవస్థాగత సంబంధాలను మరింత బలపరుచుకునే దిశగా ఈ చర్యలు వుంటాయన్నారు. ఈ ఏడాది 4వేల కోట్ల యూరోల విలువైన భద్రతా సాయాన్ని ఉక్రెయిన్‌కు సామూహికంగా అందచేసేందుకు మిత్రపక్షాల నుండి హామీని అమెరికా పొందిందని సులివాన్ చెప్పారు.



క్రూర చట్టాల రద్దుకై ఒత్తిడి

- లండన్‌లో నిరసన ప్రదర్శన

లండన్: ప్రజాతంత్ర యుతంగా చేపట్టే నిరసనలను అణచివేయడానికి టోరీలు తీసుకొచ్చిన క్రూరమైన చట్టాలను రద్దు చేయాలని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఇటీవల లండన్‌లో పాలస్తీనా అనుకూల శాంతి సంఘాలు, పర్యావరణ, పౌర హక్కుల సంస్థల ఆధ్వర్యాన ప్రదర్శన జరిగింది. అనంతరం కొత్త మంత్రులను కలసి వారు ఒక విజ్ఞాపనా పత్రాన్ని అందజేశారు. అసమ్మతి గొంతు నొక్కే దుర్మార్గమైన చట్టాలను వెంటనే రద్దు చేయాలని, భావ ప్రకటనా స్వేచ్ఛ ఛాంపియన్లుగా నిలవాలని వారు ఆ మెమోరాండంలో విజ్ఞప్తి చేశారు. యూరప్ అంతటా శాంతియుత ప్రదర్శనలపై దాడులు పెరుగుతున్నాయని, వాక్ స్వాతంత్ర్యం హరించుకుపోతోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది.

ముస్లింల మొర ఆలకించని స్టార్మర్

బ్రిటన్ కొత్త ప్రధాని కీర్ స్టార్మర్ తమ ఆందోళనలను అంతగా పట్టించుకోవడం లేదనే భావన దేశమంతటా ముస్లింలలో నెలకొంది. లేబర్ పార్టీకి సీట్లు పెరిగినా, ఓట్లు అంతగా పెరగకపోవడానికి, పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన నలుగురు ముస్లిం ఎంపీలు లేబర్ పార్టీ అభ్యర్థులపైనే గెలవడం, మరి కొన్ని చోట్ల గట్టి పోటీ ఇవ్వడం దీనినే సూచిస్తోంది. ఇస్లామిక్ ఫోబియో, వలసలుపై ఆయన తీసుకున్న వైఖరి ముస్లింలలో ఈ అసంతృప్తికి ఒక ముఖ్య కారణమని తెలుస్తోంది. బంగ్లాదేశీయులను బహిష్కరించాలంటూ స్టార్మర్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఇస్లామిక్ ఫోబియోకు దర్పణం పడుతున్నాయని విమర్శకులు పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ యథేచ్ఛగా సాగిస్తున్న మారణ హోమాన్ని సమర్థించడం, కాల్పుల విరమణ పిలుపు ఇవ్వడానికి నిరాకరించడం, ఇజ్రాయిల్‌కు ఆయుధ అమ్మకాలను నిలిపివేయడానికి తిరస్కరించడం, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు ససేమిరా అనడం వంటివి స్టార్మర్ ముస్లిం వ్యతిరేక వైఖరికి కొన్ని ఉదాహరణలు.

రక్షణ రంగానికి పెద్ద పీట

రానున్న బడ్జెట్‌లో రక్షణ రంగానికి పెద్ద పీట వేస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించారు. వాషింగ్టన్‌లో నాటో మూడు రోజుల సదస్సులో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లే ముందు ఆయన లండన్‌లో ఓ పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 2.5 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పారు. చాలా యూరోపియన్ దేశాలు 2 శాతం కేటాయించడానికే సతమతమవుతున్న స్థితిలో బ్రిటన్‌లో లేబర్ పార్టీ ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం పలు విమర్శలకు తావిచ్చింది.

ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ, ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. ఉక్రెయిన్‌కు 1600 కోట్ల డాలర్ల సైనిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ భారాలు ఏం చేస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న 17 వేల కోట్ల రూపాయల ట్రూ అప్‌ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని చెప్పిన వి. శ్రీనివాసరావు వ్యవసాయబోర్లకు పెట్టిన స్మార్ట్‌మీటర్లు పీకేయాలని లోకేష్ ఎన్నికల ముందు బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయనమాట విని రైతులు మీటర్లను ధ్వంసం చేశారని చెప్పారు. . మరో నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్మార్ట్‌మీటర్లపై కోర్టులో కేసు కూడా వేశారని తెలిపారు. ఇప్పుడు శ్వేతపత్రం విడుదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని కొనసాగిస్తామని, సోలార్‌తో అనుసంధానం చేస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. . భవిష్యత్‌లో స్మార్ట్‌మీటర్లు ఉచిత విద్యుత్ ఎగవేసేందుకు మెడమీద కత్తిలా ఉపయోగపడతాయని అన్నారు. ఈ మీటర్లు బిగించిన షిర్డిసాయి కంపెనీ వందల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని తెలుగుదేశం విమర్శించిందని, ఆ కుంభకోణంపై విచారణ జరపాలని తాము కూడా ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. దీనిపై శ్వేతపత్రంలో కనీసం ప్రస్తావన చేయలేదని అన్నారు.డిస్కమ్‌లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రపంచబ్యాంకు పవర్ ఫర్ ఆల్ అనే నినాదాన్ని కేంద్రం రాష్ట్రాలపై రుద్దిందని, అంటే విద్యుత్ వ్యవస్థ మొత్తాన్ని ప్రైవేటీకరిచడమేనని పేర్కొన్నారు.

హామీల అమలుపై దిశా నిర్దేశం లేదు : బాబురావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో విద్యుత్ భారాలు చాలా ముఖ్యమైన అంశంగా ప్రజల్లో ఎజెండాగా మారిందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం అసమగ్రంగా పాక్షికంగా ఉందని అన్నారు. శ్వేతపత్రంలో గత ప్రభుత్వ తప్పులు, లోపాలు, భారాలను బాగానే చెప్పారని, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం శ్వేతపత్రం దిశానిర్దేశం చేసేదిశలో లేదని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు, నష్టాలకు కారణమవుతోందని, ఈ విషయాన్ని శ్వేతపత్రంలో విస్మరించారని అన్నారు. ఇన్వెస్టర్లకు విశ్వాసం కలిగించాలని సిఎం చెప్పారని, అదే సమయంలో ఓట్లేసి గెలిపించిన ప్రజలకు విశ్వాసం కలిగించడంకూడా ముఖ్యమని అన్నారు. తక్షణం ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అదానీ కంపెనీతో 25 సంవత్సరాల పాటు సెకీ ద్వారా చేసుకున్న ఒప్పందం వల్ల ఏడాదికి రూ.3,800 కోట్ల నష్టం జరుగుతుందని, 25 ఏళ్లలో 90 వేల కోట్లపైన నష్టం వాటిల్లుతుందని వివరించారు. అదానీ కంపెనీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పంద రద్దు గురించి ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సంఘాలు, సంస్థలు, ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని అన్నారు.

విశాఖస్టీలుపై స్పష్టమైన హామీ తీసుకోవాలి

విశాఖపట్నం స్టీలు ప్లాంటును ప్రైవేటీకరించబోమని కేంద్రం నుండి టిడిపి కూటమి ప్రభుత్వం స్పష్టమైన హామీ తీసుకోవాలని వి. శ్రీనివాసరావు డిమాండు చేశారు. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఇటీవల మాట్లాడుతూ విశాఖ స్టీలు నష్టాల్లో ఉందని, ప్రైవేటీకరణ అనివార్యం అవుతుందని చెప్పారని పేర్కొన్నారు. మరోవైపు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విశాఖ స్టీలును ప్రైవేటీకరించబోమని చెబుతున్నారని ఇద్దరూ కలిసి ప్రభుత్వం నడుపుతూ విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి ఎంపిలు కూడా పార్లమెంటులో గణనీయంగా ఉన్నారని, వారంతా రానున్న పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రయివేటీకరణ ఆపేందుకు కేంద్రం నుండి స్పష్టమైన హామీ తీసుకోవాలని డిమాండు చేశారు.

ఆల్ట్రాటెక్ యాజమాన్యంపై ఉదాసీనత

జగ్గయ్య పేట సమీపంలోని ఆల్ట్రాటెక్ కంపెనీలో జరిగిన ప్రమాదం జరిగి ఇద్దరు చనిపోయి, మరో ముగ్గురు ప్రాణాపాయస్థితిలో ఉంటే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు. ఇది పొరపాటున జరిగింది కాదని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యగా పరిగణించి యాజమాన్యంపై కొత్తచట్టం 103 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఊరికి ఆనుకుని కంపెనీకి ఎలా అనుమతి ఇచ్చారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పైగా స్థానికులకు ఉద్యోగాలు లేవని, పదేళ్లుగా చేస్తున్నా రూ.12 వేలు వేతనం మాత్రమే ఇస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సగటున ఏడాదికి 70 నుండి 80 పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని 700 నుండి వెయ్యి మందికి తీవ్రంగా గాయాలపాలవుతున్నారని అన్నారు. ఎల్‌అండ్‌టి, ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ కంపెనీ కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని, సిఎస్‌ఆర్ నిధులు పంచాయతీకి ఇవ్వడం లేదని తెలిపారు. ఆస్పత్రి, స్కూలు లేదని అన్నారు.

గ్రామ ప్రజలు పదిరోజుల నుండి ఆందోళన వ్యక్తం చేస్తుంటే వారిని పట్టించుకోకుండా పోలీసులతో కొట్టించారని అన్నారు. గతంలో ప్రమాదం జరిగిన సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం ఇవ్వకుండా ఇచ్చినట్లు రికార్డుల్లో రాసుకున్నారని తెలిపారు. ప్రమాదానికి కారకులైన బాధ్యులపైనా, ప్రజలపై దాడిచేసి కొట్టిన పోలీసులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ లోపలకు వెళ్లడానికి లేకుండా పోలీసులు కాపలా కాస్తున్నారని అన్నారు. కార్మికశాఖ మంత్రి ఆస్పత్రిలో రోగులను చూసినా, కంపెనీ వద్దకు వెళ్లకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై టిడిపి వైఖరేంటి?

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్‌ప్లాంట్ 7 మిలియన్ టన్నుల (ఎంటి) సామర్థ్యాన్ని కలిగి ఉంది. తాజా పెట్టుబడిని పంపిస్తే 17 ఎంటికి వరకు విస్తరించవచ్చు. 2022 జనవరిలో నాలుగు కేంద్ర పిఎస్‌యులు, రెండు ఒడిశా ప్రభుత్వ పిఎస్‌యుల సంయుక్త యాజమాన్యంలోని ఎన్‌ఐఎన్‌ఎల్‌ను టాటా గ్రూపు రూ.12,100 కోట్లకు కొనుగోలు చేసింది. ప్లాంట్‌ను పునరుద్ధరించడం, సిబ్బంది ఉద్యోగాలను కాపాడటంతోపాటు , టాటా భారీ పెట్టుబడులతో ప్లాంట్ సామర్థ్యాన్ని విస్తరించింది" అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అలాగే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8,000 కోట్లను డిమాండ్ చేస్తుందని ఆయన చెప్పారు. కనుక టిడిపి వైఖరి ఎలా వుండనుందో ముస్ముందు తెలుస్తుంది.

కేంద్రం తాజా ప్రణాళిక

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా ఒక ప్రణాళికను రూపొందిస్తోందని సమాచారం. కాబోయే ప్లాంట్ కొనుగోలుదారు దాని సామర్థ్యం 7 మిలియన్ టన్నులకు విస్తరించేందకు కట్టుబడి ఉండాలి.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దాదాపు 19 వేల ఎకరాల భూమిని కలిగింది. ఇందులో ఆరు వేల ఎకరాల గ్రీన్ బెల్ట్ కింద ఉంది. కాబోయే కొనుగోలుదారులు కొత్త గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేయడం గురించి ఒత్తిడి చేయబోమని ప్రతిపాదించనుంది.

ఈ భూములన్నీ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంటు ప్రైవేటుపరం కాకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ, రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రంలోని బిజెపిని ఏమేరకు నిలదీస్తాయో చూడాలి.

కదంతొక్కిన కార్మికవర్గం

మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు మద్దతుగా ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడారు. విజయవాడ లెనిన్ సెంటరులో స్కీం వర్కర్ల ధర్నాలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తదితరులు ప్రసంగించారు. లెనిన్ సెంటరులో కార్మికులు ధర్నా చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 11 కేంద్రాల్లో, కృష్ణా జిల్లాలో 14 ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్వేటినగరం ప్రాజెక్టులో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ప్రమాదకర క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లో, కాకినాడలోని హెడ్ పోస్టాఫీసు వద్ద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో సిఐటియు, స్కీమ్ వర్కర్ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కార్మికులు, ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అల్లూరి జిల్లాలో అరకులోయ, విఆర్.పురం, చింతూరు, మారేడుమిల్లి, జికె.వీధి, కొయ్యూరు మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. పాడేరు ఐటిడిఎ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ముంచంగిపుట్టు, అనంతగిరి, పెదబయలు, డుంబ్రిగుడలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అన్ని మండల కేంద్రాల్లో సిఐటియు ఆధ్వర్యాన డిమాండ్స్ డే నిర్వహించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన, పార్వతీపురంలో కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సిడిపిఒ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రకాశం, బాపట్ల, వైఎస్ఆర్, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.





మీకోసం

ఈగలు ఎక్కువగా వస్తున్న ప్రదేశంలో పుదీనా ఆకులను కత్తిరించి పెడితే ఈగల బెడద తగ్గుతుంది.

జీవన సౌరభం

గమ్యం ఎంత దూరంలో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మాత్రం మొదటి అడుగు నుంచే మొదలవుతుంది.

నింగి , నేల మాదే...



అక్షరాలతో
అడవిని ఆస్వాదిస్తాం!
ఏ బి సి డి తో
ఎవరెస్ట్‌ను ఎక్కేస్తాం!

అంకెలతో
అంతరిక్షంలో అడుగేస్తాం!
పుస్తకాలతో
పుడమిపై పులకిస్తాం!

గురువులతో
గ్రహాలను చూసొస్తాం!
చదువులతో
చందమామపై
చిందులేస్తాం!


కలములతో
కాలం వెంట పయనిస్తాం!
ఆటా పాటలతో
ఆకాశంలో ఆడి పాడేస్తాం!

నేస్తాలతో
నింగి, నేలల్లో నిద్రిస్తాం!
తల్లిదండ్రులతో
సంతోషంగా జీవిస్తాం!

- బోనగిరి.
పాండు రంగ

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువులు, వాటి స్థావరాలు ఉన్నాయి. ఏ జంతువుకి ఏ స్థావరమో మీరు జత చేయండి చూద్దాం!



నేను గీసిన బొమ్మ





మలిశెట్టి సాయి ప్రణవి
4వ తరగతి,
కుమార్ సిబిఎస్ఇ స్కూల్, నూజివీడు,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

హాస్యం పేరుతో అవహేళన వద్దు..

హాస్యం.. మానసిక ఉల్లాసాన్ని కలిగించాలి. కొంత పాజిటివిటీని పెంచాలి. అంతేగాని ఎబ్బెట్టుగా ఉండడం, వెగటు పుట్టించడం చేయకూడదు. ఎదుటి వారిని దూషిస్తేనో, దుర్భాషలాడితేనో హాస్యం పుట్టదు. కానీ నేటి సినిమాల్లో హాస్యం పేరుతో హద్దులు దాటుతున్నారు. ద్వంద్వార్థాలు, బాడీ షేమింగ్ చేయడం, లావు, సన్నం, నలుపు, తెలుపు, పొట్టి, పొడుగు ఇలా ఒకటా రెండా.. వీటన్నింటితో పాటు హాస్యం పండించేందుకు వైకల్యబాధితులను కించపర్చడం, వైకల్యాన్ని అపహాస్యంగా చూపించడం ఎప్పటి నుండో చేస్తున్నారు. అయితే ఇదంతా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ, ఆయా సినిమాలకు క్లీన్ చీట్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు అధికారులు. ఈ ధోరణికి చెంపపెట్టుగా ఇటీవల సుప్రీంకోర్టు ఓ తీర్పు ఇచ్చింది. హాస్యం పేరుతో వైకల్యబాధితులను కించపర్చడం సబబు కాదని హెచ్చరించింది.





సినిమా ప్రభావంత మాధ్యమం. సమాజాన్ని చైతన్యం చేయడంలో సినిమాకి ప్రత్యేకమైన స్థానం. అటువంటి సినిమాల్లో ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? అనే విషయాలు ప్రముఖంగా చర్చించాలి. కానీ మనకు తెలిసిన, చూసిన ఎన్నో సినిమాల్లో ముఖ్యంగా హాస్యప్రధాన చిత్రాల్లో బాడీషేమింగ్ చేస్తూ హాస్యాన్ని పండించే ప్రయత్నం చేశారు. 'కితకితలు' సినిమాలో కథానాయిక అధికబరువుని హాస్యానికి ప్రధాన వనరుగా ఉపయోగించారు. పెళ్లిచూపుల నుండి పెళ్లి తంతు, ఆపై సినిమా ఆద్యంతం, ఆ పాత్రపై హీరో నరేష్, క్యారక్టర్ ఆర్టిస్టు కృష్ణ భగవాన్ ఎన్నో సెటైర్లు, విమర్శలు చేస్తారు. అలాగే అనుష్క ప్రధాన పాత్రలో వచ్చిన 'జీరో సైజ్' సినిమాలో కూడా ఆమె అధికబరువుని అపహాస్యం చేసే పాత్రలు తన చుట్టూ కనపడతాయి. ఇక అల్లరి నరేష్ 'లడ్డు బాబు' చిత్రంలోనైతే చిన్న పిల్లలతో ఆ పాత్రను గేలి చేయడం, అవమానించడం చూపిస్తారు. ఇలా బాడీ షేమింగ్ గురించి ఆయా సినిమాల్లో హాస్యం పేరుతో వెగటు పుట్టించారు. పిల్లలతో ఆ పాత్రలను ఏడిపించడం చూస్తుంటే ఏం చెప్పాలనుకుంటున్నారో అర్థం కాదు.

అంతేకాదు, కాలేజీ బ్యాక్‌గ్రౌండ్‌తో తెరకెక్కిన ప్రతి సినిమాలో ఫ్రెండ్స్‌లో ఎవరో ఒకరిని నల్లగానో, పొట్టిగానో చూపించి, ఆ పాత్ర చుట్టూ హాస్య సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. బంతి, బాలు, నల్లోడు, పొట్టోడు, సోడా కళ్లోడు ఇలా ఒకటి, రెండు కాదు, సవాలక్ష పేర్లతో ఆయా వ్యక్తులను పిలిపిస్తారు. 'స్టాలిన్' చిత్రంలో సునీల్ పాత్రతో ఆ ప్రయోగమే చేశారు. శరీరాన్ని, రంగుని ఎద్దేవచేస్తూ హాస్యం పుట్టించే ప్రయత్నం చేశారు. 'ఎవడిగోల వాడిదే' సినిమాలో కొన్ని పాత్రలను వాళ్ల ఒంటితీరుని బట్టి పిలుస్తూ అవమానించేలా సన్నివేశాలు ఉంటాయి. ఇలాంటి పాత్రలు సినిమాల్లో అనేకం. ఈ ప్రయోగాలు వెగటు పుట్టిస్తాయే కానీ హాస్యాన్ని పండించవు.



అలాగే వైకల్యబాధితుల వైకల్యాన్ని ఎత్తి చూపడం, వైకల్యం పేరుతో కించపరుస్తూ మాట్లాడడం కూడా సినిమాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అగ్ర కథానాయకుడు వైకల్య పాత్రల్లో నటిస్తే ఒకింత తక్కువగా, చిన్న చిన్న ఆర్టిస్టులతో ఆ పాత్రలు వేయిస్తే అత్యంత జుగుప్సగా సంభాషణలు రాస్తున్నారు. 'రంగస్థలం' చిత్రంలో రామ్‌చరణ్ చెవిటి పాత్ర, 'ఊపిరి' సినిమాలో చక్రాల కుర్చీకే పరిమితమైన పాత్రలో నాగార్జున, 'రాజా ది గ్రేట్' చిత్రంలో రవితేజ, 'నీవెవరో' చిత్రంలో ఆదిపినిశెట్టి, 'అంధగాడు' చిత్రంలో రాజ్‌తరుణ్‌ని అంధ పాత్రల్లో చూపించినప్పుడు హీరోయిజంగా ఈ పాత్రలను తీర్చిదిద్దారు. అదే చిన్న చిన్న ఆర్టిస్టులు ఆ పాత్రలు చేసినప్పుడు వైకల్యాన్ని ఎత్తి చూపుతూ సంభాషణలు రాస్తారు. ఎత్తు తక్కువగా ఉండే సునీల్‌శెట్టి, వేణుమాధవ్, వీరయ్య, బొద్దుగా ఉండే విద్యుల్లేఖ, గీతాసింగ్, కళు చిదంబరం, ఐరన్ లెగ్ శాస్త్రి, కల్పనారాయ్ తదితరులను ఆయా పాత్రల్లో చూపించినప్పుడు చాలా హేయమైన హాస్యాన్ని చిత్రీకరించారు.



ఇంకా కాళ్లు, చేతులు లేని పాత్రలను సినిమాల్లో చూపించేటప్పుడు చాలా దీనమైన స్థితిలో ఉన్నట్లు చిత్రీకరిస్తారు. కర్ర సాయంతో నడిచే పాత్రలు, చేతుల్లేని వ్యక్తులు, మంచానికే పరిమితమైన వారిపై చిత్రీకరించే సన్నివేశాలు చాలా హృద్యంగా చూపిస్తారు. వైకల్య బాధితులు అంటే హేళన చేయడానికో, జాలి చూపించడానికో అన్నట్లుగా ఆయా పాత్రలు ఉంటాయి. దీనిపైనే ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది.




ఇలాంటి సున్నితమైన అంశాల పట్ల రచయితలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులకు అవగాహన ఉండాలని చెప్పింది. వైకల్య బాధితుల వైద్య పరిస్థితిని వాస్తవాలకు దగ్గరగా చూపించాలని, వక్రీకరించకూడదని స్పష్టం చేసింది. వైకల్యబాధితులపై చిత్రించే సన్నివేశాల్లో వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టేలా చూపించాలని సూచించింది. వైకల్య బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను మాత్రమే కాక, వారు సాధించిన విజయాలు, ప్రతిభ, సమాజానికి, దేశానికి వారు చేసిన సేవను చూపించాలని ఆదేశాలు జారీచేసింది.

ఇప్పుడే ఎందుకు? ఏమని? స్పందించారు..

2023లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'ఆంఖ్ మిచోలి'లో కొన్ని సన్నివేశాలు వైకల్యబాధితులను కించపర్చేలా ఉన్నాయని, నిపున్ మల్హోత్రా అనే వైకల్యబాధిత కార్యకర్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. 'సినిమాల్లో పాత్రలను సృష్టించే సమయంలోనే రూపకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలి. వైకల్యబాధితులను ఉద్దేశిస్తూ మాట్లాడే భాష విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాల'ని సూచించింది. మందబుద్ధి, వికలాంగుడు వంటి పదాలను వాడకూడదని చెప్పింది. వైకల్యబాధితులపై సన్నివేశాలు చిత్రించేటప్పుడు వారు ఎదుర్కొనే సమస్యలే కాకుండా, వారి ప్రతిభ, విజయం, సమాజానికి చేసే సేవలను చూపించాలి. ఆయా మాధ్యమాల్లో వైకల్యం ఉన్న వ్యక్తులను కించపరిచే, అగౌరపరిచేలా హాస్యం ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, అవయవాలు సరిగ్గా ఎదగని, మానసిక ఆరోగ్యం కోల్పోయిన వ్యక్తులు మన చుట్టూ ఎంతోమంది. వారు సాధించిన ఎన్నో విజయాలు చూస్తున్నాం. అయినా సినిమా వంటి మాధ్యమాల్లో వారిని, వారి స్థితిని అవమానించి చూపడం, తక్కువ చేసి చెప్పడం ఆమోదయోగ్యం కాదు. దేశం యావత్ ఈ తీర్పుపై చర్చించేలా, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలో వెలువడిన ఈ తీర్పు స్వాగతించదగ్గది.

కిరణ్ అబ్బవరం కొత్త సినిమా 'క'



హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'క'. శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని నిర్మాతలు ప్రకటించారు. మేకర్లు టైటిల్‌ను 'క'గా ప్రకటించారు.

గ్లాడియేటర్ 2 ట్రైలర్ విడుదల



2000లో విడుదలైన 'గ్లాడియేటర్' మూవీకి సీక్వెల్‌గా త్వరలో 'గ్లాడియేటర్ 2' రాబోతోంది. 24 ఏళ్ల తర్వాత సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. నవంబర్ 22న ఈ సినిమా విడుదల కానుంది.

'పెళ్లిరోజు'లో జడ్జి పాత్రలో నటిస్తున్నా : సుమన్



'పెళ్లిరోజు' సినిమాలో తాను జడ్జి పాత్రలో నటిస్తున్నానని హీరో సుమన్ వెల్లడించారు. ఈ సినిమాకు వల్లభనేని సురేష్‌చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. ఏలూరులో ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ 'పెళ్లి'లో మన దేశ ఆచార వ్యవహారాలకు నిలువుదట్టం...మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే చక్కని రూపమే పెళ్లి. పెళ్లి అయిన కొన్నాళ్లకు జరిగే పరిణామాలతో విడిపోవాలనుకుంటారు. వారి పెళ్లిరోజే తిరిగి విడాకుల నుంచి మళ్లీ కలిసిపోయేలా చేయటమే ఇతివృత్తంగా ఈ సినిమా సాగుతుంది' అని వివరించారు. లాయర్‌గా వీరంకి వెంకట నరసింహారావు నటించారు. మిగతావారంతా స్థానిక కళాకారులే నటులుగా ఉన్నారు.

'ఆపరేషన్ రావణ్' మూవీ బాగా వచ్చింది



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య రూపొందిస్తున్నారు. హీరోయిన్‌గా విపిన్ నటిస్తున్నారు. ఆగస్టు 2న ఈ సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ట్రైలర్‌ను బుధవారంనాడు మేకర్లు విడుదల చేశారు. హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఆపరేషన్ రావణ్' హిట్ సినిమాగా నిలువబోతుందన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్ చొల్లేటి మాట్లాడుతూ 'ఆపరేషన్ రావణ్' సినిమాకు తాను పనిచేయడం హ్యాపీగా ఉంది. సినిమా బాగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ మా టీమ్ కు ఉండాలని కోరుకుంటున్నా' అన్నారు. పూర్ణాచారి, హీరోయిన్ సంగీర్త విపిన్, కమెడియన్ రాకెట్ రాఘవ, రైటర్ లక్ష్మీ లోహిత్, ప్రణవం, ఎడిటర్ సత్య, డైరెక్టర్ వెంకట సత్య, హీరోలు రక్షిత్ అట్లూరి మాట్లాడారు.

త్వరలో 'పొలిమేర 3'

అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో 'పొలిమేర 3' సీక్వెల్‌గా రానుంది. నిర్మాత భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి నిర్మించనున్నారు. 'పొలిమేర 3' ప్రకటన సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో ఆసక్తి కల్గిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3'లో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో 'మా ఊరి పొలిమేర' డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో నేరుగా స్ట్రీమింగ్ అయ్యింది.

సుందర్ ఆల్‌రౌండ్ షో

- మూడో టి20లోనూ గెలుపు
- జింబాబ్వేపై 23పరుగుల తేడాతో ఘన విజయం



హరారే: ఐదు టి20ల సిరీస్ ఆడేందుకు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత యువ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. తొలి టి20లో నిరాశపరిచినా.. రెండు, మూడు టి20ల్లో నెగ్గి సిరీస్ ఆధిక్యతలో నిలిచింది. హరారే వేదికగా జింబాబ్వేతో బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. డియోన్ మైయర్స్(65నాటౌట్, 49 బంతుల్లో; 7ఫోర్లు, సిక్సర్), క్లైవ్ మథండె (37, 26 బంతుల్లో; 2ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అవేశ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో నిలిచింది. వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66, 49 బంతుల్లో; 7ఫోర్లు, 3సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (49, 28 బంతుల్లో; 4ఫోర్లు, 3సిక్సర్లు) రాణించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (36, 27 బంతుల్లో; 4ఫోర్లు, 2సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. రెండో టి20లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ శర్మ(10) నిరాశపరిచాడు. గిల్‌తో ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు, సిక్సర్‌తో తన ఉద్దేశాన్ని చాటాడు. రెండో ఓవర్లో గిల్ సైతం 4, 6, 4తో భారత్ స్కోరు రాకెట్ వేగాన్నితలపించింది. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడటంతో 8ఓవర్లు ముగిసేసరికే భారత్ వికెట్ నష్టపోకుండా 67పరుగులు చేసింది. తొమ్మిదో ఓవర్లో రజా వేసిన బంతిని స్వీప్ చేయబోయిన జైస్వాల్.. బెన్నెట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ ఈ మ్యాచ్‌లో తేలిపోయాడు. కానీ రుతురాజ్ అండతో గిల్ రెచ్చిపోయాడు. మధ్వెరె వేసిన 13వ ఓవర్లో గిల్ ఓ సిక్సర్ బాదగా రుతురాజ్ 6,4 సాధించాడు. చటారా 14వ ఓవర్లో ఫోర్ కొట్టిన గిల్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో గిల్.. ముజర్బని వేసిన 18వ ఓవర్లో రజాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కానీ ఆఖర్లో రుతురాజ్ వేగంగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. అర్ధ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో రుతురాజ్ ఔట్ అయి నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. జింబాబ్వే బౌలర్లలో కెప్టెన్ సికిందర్ రాజా, బ్లెస్సింగ్ ముజర్బనికి రెండేసి వికెట్లు దక్కాయి. నాల్గో టి20 శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బెన్నెట్ (బి)రాజా 36, శుభ్‌మన్ (సి)రాజా (బి)ముజరబాని 66, అభిషేక్ శర్మ (సి)మరుమణి (బి)రాజా 10, రుతురాజ్ గైక్వాడ్ (సి)మధెవెరె (బి)ముజరబాని 49, సంజు (నాటౌట్) 12, రింకు సింగ్ (నాటౌట్) 1, అదనం 8. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 182పరుగులు. **వికెట్ల పతనం:** 1/67, 2/81, 3/153, 4/177 **బౌలింగ్:** బెన్నెట్ 1-0-15-0, నరవా 4-0-39-0, ఛటారా 3-0-30-0, ముజరబాని 4-0-25-2, రాజా 4-0-24-2, మసకడ్జా 3-0-25-0, మధెవెరె 1-0-19-0

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెవెరె (సి)అభిషేక్ శర్మ (బి)ఆవేశ్ ఖాన్ 1, మరుమణి (సి)దూబె (బి)ఖలీల్ అహ్మద్ 13, బెన్నెట్ (సి)బిష్ణోయ్ (బి)ఆవేశ్ ఖాన్ 4, మెయిర్స్ (నాటౌట్) 65, సికిందర్ రాజా (సి)రింకు సింగ్ (బి)సుందర్ 15, ఛాంప్‌బెల్ (సి)రియాన్ పరాగ్ (బి)సుందర్ 1, మధండే (సి)రింకు సింగ్ (బి)సుందర్ 37, మసకడ్జా (నాటౌట్) 18, అదనం 5. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 159పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/19, 3/19, 4/37, 5/39, 6/116 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-15-1, ఆవేశ్ ఖాన్ 4-0-39-2, రవి బిష్ణోయ్ 4-0-27-0, సుందర్ 4-0-15-3, అభిషేక్ శర్మ 2-0-23-0, దూబె 2-0-27-0

పారిస్ ఒలింపిక్స్ ఏర్పాట్లపై
జాతీయ ఒలింపిక్ జట్ల పెదవి విరుపు
ఏసిల స్థానంలో కూలింగ్ ఏర్పాట్లు



పారిస్: పారిస్ ఒలింపిక్స్ మరో రెండు వారాల్లో ప్రారంభం కానుండగా.. అక్కడి ఏర్పాట్లు జాతీయ ఒలింపిక్ జట్లకు ఆందోళన కలిగిస్తున్నాయి. జూన్ నెలాఖరునుంచే అథ్లెట్లు ఇక్కడికి విచ్చేస్తున్నా.. పారిస్ ఒలింపిక్ విలేజ్‌లో ఏసిలకు బదులు తాత్కాలిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 2,500 తాత్కాలిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ కూలింగ్ యూనిట్లను భూమి లోపలనుంచి అమర్చడం వల్ల చల్లదనంలో సమతుల్యతలు ఏర్పడే అవకాశముందని అథ్లెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం పారిస్ నిర్వాహకులు ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయించగా.. జాతీయ ఒలింపిక్ జట్లనుంచి ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అక్కడి నిర్వాహకులు జాతీయ ఒలింపిక్ జట్ల వ్యతిరేకతను పట్టించుకోకుండా తమ పనుల్లో నిమగ్నమైపోయారు. పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 7వేల గదులను ఏర్పాటు చేశారు. అమెరికా ఒలింపిక్, పారాలింపిక్స్ సిఇవో సారా హిర్ష్‌లాండ్ మాట్లాడుతూ.. అథ్లెట్లకోసం జర్మనీ, ఆస్ట్రేలియా, ఇటలీ, కెనడా, బ్రిటన్‌లనుంచి ఏసిలను పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉన్నా.. అధిక ఖర్చులకు భయపడి తాత్కాలిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ఒలింపిక్ విలేజ్‌ను మీడియా సందర్శించగా.. అథ్లెట్ల సౌలభ్యం కోసం 2,500 ఏసీలను కొనుగోలు ఆదేశించామని అక్కడి నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్స్ ఖర్చు ఎంతైనా వెనక్కి తగ్గేది లేదని గతంలో పారిస్ మేయర్ అన్నే హిడాల్గో వెల్లడించారు.

సెమీస్‌కు రైబకినా, క్రేజికోవా
వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ


క్రేజికోవా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్), 31వ సీడ్ క్రేజికోవా(చెక్ రిపబ్లిక్) ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో రైబకినా 6-3, 6-2తో 21వ సీడ్ స్విటోలినా(ఉక్రెయిన్)ను చిత్తుచేయగా.. క్రేజికోవా 6-4, 7-6(7-4)తో 13వ సీడ్ ఒస్టాపెంకో(లాత్వియా)ను ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. బుధవారం జకోవిచ్-డి-మినర్ మధ్య జరగాల్సిన మ్యాచ్ జరగలేదు. క్వార్టర్స్ మ్యాచ్‌కు ముందు గాయం కారణంగా డి-మినర్ వైదొలగడంతో జకోవిచ్‌ను విజేతగా ప్రకటించారు. మరో క్వార్టర్స్‌లో 25వ సీడ్ మసెట్టి(ఇటలీ) 3-6, 7-6(7-5), 6-2, 3-6, 6-0తో 13వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా)ను ఓడించాడు.

సింగిల్స్ సెమీఫైనల్స్...

మహిళలు..	పురుషులు
క్రేజికోవా × రైబకినా	మెద్వెదెవ్ × అల్కరాజ్
వేకిక్ × పోలిని	జకోవిచ్×మసెట్టి

యూరో కప్ ఫైనల్‌కు స్పెయిన్
సెమీస్‌లో ఫ్రాన్స్‌పై 2-1గోల్స్‌తో గెలుపు

బెర్లిన్(జర్మనీ): యూరో కప్-2024 ఫైనల్లోకి స్పెయిన్ జట్టు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో స్పెయిన్ జట్టు 2-1గోల్స్ తేడాతో ఫిఫా ప్రపంచకప్ రన్నరప్ ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఈ మూడు గోల్స్ మ్యాచ్‌లో తొలి అర్ధ భాగంలోనే నమోదయ్యాయి. 8వ నిమిషంలో రాండల్ కోలో ములాని గోల్ సాధించి ఫ్రాన్స్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు 21వ నిమిషంలో లామిన్ యమాల్, 25వ నిమిషంలో డానీ ఓల్మో గోల్స్ సాధించారు.

రెండో అర్ధ భాగంలో ఫ్రాన్స్ ఎంత ప్రయత్నించినా.. స్పెయిన్ ఆధిక్యతను తగ్గించలేక పోయింది. ఫలితంగా ఓటమిపాలైంది. లామిన్ యమాల్ యూరో కప్ చరిత్రలోనే అత్యంత పిన్నవయస్కుడైన గోల్ స్కోరర్‌గా రికార్డుల్లోకెక్కాడు. నెదర్లాండ్స్-ఇంగ్లండ్ మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుండగా.. ఈ మ్యాచ్‌లో విజేతతో 15న జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో టైటిల్‌కై తలపడనుంది.

వైఎస్ఆర్‌జిల్లాలో సౌత్ జోన్ లెవెల్-2 హాకీ పోటీలు

- దొంగ సర్టిఫికెట్లను రూపుమాపుతాం : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ (వైఎస్ఆర్ జిల్లా)



వైఎస్ఆర్ జిల్లా పులివెందులలో సౌత్‌జోన్ లెవెల్-2 హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ పోటీలను పులివెందుల లోని వైఎస్ ఆర్ హాకీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల జట్లు తలపడ్డనున్నాయి. పోటీలను రాష్ట్ర క్రీడా శాఖ, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడాజ్యోతి వెలిగించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని, ప్రతి ఉద్యోగంలో స్పోర్ట్స్ కోటా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తామని, క్రీడాశాఖలో ఉన్న దొంగ సర్టిఫికెట్లను రూపుమాపుతామని అన్నారు. ఇందుకోసం త్వరలో ఓ కమిటీని వేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బిటెక్ రవి, ఆంధ్రప్రదేశ్ హాకీ సిఇఒ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68